


అడకత్తెరలో.. వీఆర్వోలు

ఒక పక్క ఎమ్మెల్సీ ఓటర్ల పరిశీలన, సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సిద్ధం చేసేపని... మరోపక్క హౌస్ హోల్డ్ సర్వేకు సంబంధించి జియో కో ఆర్డినేట్స్ తీసుకోవాల్సిన పని. వీటి లో ఓట్ల పరిశీలన రెవెన్యూ అధికారులు చూస్తుం టే, హౌస్ హోల్డ్ సర్వే ఎంపీడీవో పర్యవేక్షణలో జరుగుతోంది. ఈ రెండింటికీ వీఆర్వోలు వెళ్లాల్సిందే. అయితే ఇక్కడే అసలు చిక్కు వచ్చిపడితే, వివిధ శాఖల మధ్య వైసీపీ సర్కారు పెట్టిన చిచ్చు మెల్లగా రాజుకుంటోంది. వీఆర్వోలను విధులకు పంపే విషయంలో ఎవరి అధికారాన్ని వారు చూపిస్తుంటే, మధ్యలో వీఆర్వోలు నలిగిపోతున్నారు.

- గత వైసీపీ సర్కారు పాలనలో చేసిన మార్పులే కారణం
- సచివాలయాల ఏర్పాటు మినహా పటిష్ట నిర్వహణ లేకే
- వీఆర్వోలు పనిచేసేది రెవెన్యూలో... వేతనం ఇచ్చే అధికారం ఎంపీడీవోలకు
- తహసీల్దార్, ఎంపీడీవోల మధ్య పెరుగుతున్న దూరం
- ఎన్నికల విధులు, హౌస్ హోల్డ్ సర్వేల పనుల్లో గందరగోళం
- మా ఉత్తర్వులు ఫాలో అవ్వాలంటే మా ఉత్తర్వులంటూ ఆధిపత్య పోరు
- ఛార్జిమెమోలు, వేతనాల నిలుపుదల వరకు ముదిరిన వ్యవహారం
- కలెక్టర్ల దృష్టికి తీసుకెళుతున్న వీఆర్వోలు

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు తప్పనిసరి కావటంతో ఓటర్ల దరఖాస్తుల పరిశీలనకు వెళ్లాలో, సర్వేకు వెళ్లాలో తెలియని సందిగ్ధంలో కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపమన్నట్టు తయారయింది వీఆర్ఓల పరిస్థితి. ఓపక్క తహసీల్దార్లు వారు చెప్పిన విధులకు వెళ్లాలని ఆదేశాలిస్తుంటే, మరోపక్క ఎంపీడీఓలు మాకు తెలియకుండా మీ ఇష్టమొచ్చినట్టు వెళ్ళిపోతే ఎట్లా! జీతమిచ్చేది మేమయితే మా మాట ఎందుకు వినరంటూ మెమోలు ఇచ్చే పరిస్థితి నుంచి చివరకు జీతాలు ఆపేస్తామని బెదిరించే వరకు వెళ్లిందంటే వారిమధ్య అధికారిక పోరు ఎంతవరకు వెళ్లిందనేది అర్థమవుతుంది. విధులు సక్రమంగా చేద్దామనుకునే వీఆర్ఓల పరిస్థితి ఇబ్బందికరంగా మారితే, తహసీల్దార్, ఎంపీడీఓల మధ్య ఏర్పడుతున్న సమన్వయ లోపాన్ని కొందరు వీఆర్ఓలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. అసలు విధులలోనే లేకుండా తహసీల్దార్ అడిగితే, ఎంపీడీఓ రమ్మన్నారని, ఎంపీడీఓ ఫోన్ చేస్తే, తహసీల్దార్ మరో పనికి పంపారంటూ ఇద్దరి దగ్గర ఒకరిపైఒకరికి చెప్పి తప్పించుకు తిరుగుతున్న పరిస్థితి కూడా ఉంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొన్ని మండలాల్లో రెండు శాఖల మధ్య చిచ్చు రాజుకుంటూనే ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారం కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లాలని, అప్పటికీ పరిష్కారం కాకుంటే ఆందోళనకు దిగాలనే ఆలోచనకు వీఆర్ఓలు వచ్చినట్టు చెబుతున్నారు. దీనంతటికీ వైసీపీ సర్కారు కాలంలో వీఆర్ఓల విధులు రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్నా, సచివాలయాల ఏర్పాటు తర్వాత వారితోపాటే వీరి వేతనాలు కూడా ఎంపీడీఓలు ఇచ్చేలా మార్పులు చేయటమే. అయితే రెండూ ప్రభుత్వ శాఖలే కావటంతో వారి మధ్య అధికారిక పోరు లేకుండా సమన్వయంతో పనిచేస్తే అంత సమస్య అయ్యేదికాదు. మొత్తం మీద గత వైసీపీ సర్కారు చేసిన అనాలోచిత మార్పులు ఇప్పుడు ప్రభుత్వ శాఖల్లో చిచ్చు రేపటానికి కారణమవుతోంది.

అంతా ఓటర్ల జాబితా బిజీలో

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా సిద్ధంచేసే పని ఒకపక్షన ఉంటే, ఈ నెల 6 నుంచి బుధవారం వరకు ఓటరు దరఖాస్తుల పరిశీలన పనిలో వీఆర్ఓలు ఉన్నారు. ఈ నెల 23న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కూడా విడుదల కానుంది. అప్పటి నుంచి డిసెంబర్ 7 వరకు మళ్లీ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, ఇతర లోపాల పరిశీలన పని ఉంటుంది. వీటిని తప్పనిసరిగా బీఎల్ఓలే చెయ్యాల్సి ఉంది. త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా సిద్ధంచేసే పనికూడా జరుగుతోంది. దీనికి ఓటర్ల దరఖాస్తులు ఉండవు. అయితే నీటిపారుదల శాఖ ఇచ్చిన ఆయకట్టుదారుల వివరాల ఆధారంగా రెవెన్యూ శాఖే ఓటర్ల జాబితా సిద్ధం చేయాల్సి

(మిగతా 8వ పేజీలో..)



రూ.కోట్లలో.. కిక్కు

- అందుబాటులో కోరుకున్న మద్యం
- నెల వ్యవధిలో రికార్డు స్థాయిలో అమ్మకాలు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూ.260 కోట్లకు తాగేశారు
- బాపట్ల జిల్లాలో రూ.86 కోట్ల మద్యం విక్రయం
- జగన్ హయాంలో కన్నా ఒక్క నెలలో రూ.20 కోట్ల అదనపు సేల్

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోరుకున్న బ్రాండ్లు.. కావాల్సిన మద్యం.. గతంలోలా చెల్లింపులకు పరిమితులు లేకపోవడం.. కొన్ని బార్లలోనూ ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు.. నేపథ్యంలో అటు మందుబాబులు, ఇటు ఎక్సైజ్ శాఖ ఖుషీ చేసుకుంటోంది. మందుబాబులు తెగ తాగేస్తోండగా.. ఎక్సైజ్ శాఖకు రూ.కోట్లు కిక్కు వస్తోంది. బ్రాందీ షాపుల విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మందుబాబులు పండుగ చేసుకుంటున్నారు. జగన్ హయాంలో గత ఐదేళ్ళుగా జేబులో దండిగా డబ్బులున్నా కూడా కోరుకున్న మద్యాన్ని కొనుక్కొని తాగలేని పరిస్థితి ఉండేది. పేరొందిన డిస్టలరీల కంపెనీలు ఉత్పత్తి చేసే మద్యంకు బదులు జే బ్రాండ్ పేరుతో నాశిరకం మద్యాన్ని ప్రభుత్వ దుకాణాల్లో అమ్మించారు. గత్యంతరం లేక పలువురు నాశిరకం మద్యాన్ని కొనుగోలు చేసి తాగి ఆరోగ్యాన్ని గుల్ల చేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోరుకున్న మద్యం అందుబాటులోకి తెస్తామని, చౌక మద్యాన్ని నాణ్యంగా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే

(మిగతా 6వ పేజీలో..)

జేకేసీ విద్యార్థి కావడం గర్వకారణం

- ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణిస్తున్న పూర్వ విద్యార్థులు
- ఆడిటోరియం ప్రారంభోత్సవంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు



సభలో మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు, వేదికపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మన్నవ మోహనకృష్ణ, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, చుక్కపల్లి రమేష్ తదితరులు

గుంటూరు(విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాల ఎంతో మంది ఉన్నతికి కారణమైంది. ఇలాంటి కళాశాల విద్యార్థినని చెప్పుకోవడం గర్వకారణం. కళాశాలలో అధ్యాపకులు, యాజమాన్యం చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించారు. ఫలితంగా ఇక్కడ చదివిన ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణిస్తున్నారు.. అని రాష్ట్ర డీజీపీ, జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థి సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. జాగర్లమూడి లక్ష్మయ్యచౌదరి పేరుతో నిర్మించిన నూతన ఆడిటోరియాన్ని కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పునర్ నిర్మించారు. రూ.2.50 కోట్లు వ్యయంతో నిర్మించిన ఈ ఆడిటోరియాన్ని బుధవారం డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ ప్రసంగిస్తూ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఎంతోమందికి చదువుతో పాటు సంస్కారం నేర్పించిన ఘనత జేకేసీదన్నారు. ఆకృతిలేని రాళ్లలాంటి తమలాంటి ఎంతోమందిని శిల్పాలుగా తీర్చిదిద్దిన ఘనత జేకేసీ అధ్యాపకులదన్నారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం జేకేసీ కళాశాలలో చదువుకున్నానని, అప్పట్లో ఇక్కడ నేర్పిన చదువు, క్రమశిక్షణ కారణంగానే నేషనల్ పోలీసు అకాడమీలో చేరినట్లు చెప్పారు. ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ తమకు క్రమశిక్షణ, అంకితభావం కళాశాలలో చదుకునే సమయంలో అలవడ్డాయన్నారు. ఫలితంగానే సేవా, రాజకీయరంగాల్లో రాణిస్తున్నట్లు వారు చెప్పారు. జేకేసీ పూర్వ విద్యార్థులు కావడం తమ అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపిచంద్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు యర్లగడ్డ ఉమాదేవి, జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మాదల శ్రీనివాసు, చుక్కపల్లి రమేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ, కళాశాల పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

- గుంటూరు, పల్నాడు జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లో తనిఖీలు
- స్వయంగా తేమ శాతాన్ని పరిశీలించిన సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్‌కురదగీ

6

పత్తి కొనుగోళ్లలో లోటుపాట్లపై కేంద్రానికి నివేదిక



గుంటూరులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ

పొదుపు సొమ్ము రూ.10 లక్షలు గోల్‌మాల్

- రుణాల చెల్లింపు నగదును స్వాహా చేసిన యానిమేటర్
- పొన్నూరు మండలం దొప్పలపూడిలో వెలుగుచూసిన వైనం

మొక్కజొన్న దిగుబడి పెంచే దిశగా పరిశోధనలు

- ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ శారద జయలక్ష్మిదేవి

8

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- మృత్యువుతో పోరాడుతున్న భర్త
- పెదకాకాని మెయిన్ సెంటర్‌లో ఘటన

దౌర్జన్యం కేసులో ముగ్గురి పేర్లు వెల్లడి

- ముగిసిన తుళ్లూరు పోలీసుల విచారణ
- రౌడీషీటర్ బోరుగడ్డ బెయిల్ పిటిషన్లు డిస్మిస్

ముసాయిదా ముద్రణకు సిద్ధం

- పట్టభద్రుల దరఖాస్తులు దాదాపు పరిష్కారం
- ఓటు కోసం 3లక్షల 32వేల 783మంది దరఖాస్తు

పొన్నెకల్లు జడ్పీస్కూల్ పీఈటీ సస్పెన్షన్

- పాఠశాల హెచ్‌ఎంకు చార్జిమెమో జారీ

పీలిస్తే.. ప్రమాదమే



- గాలిలో నాణ్యత అంతంతే
- గుంటూరులో 50 కంటే దిగిరాని పీఎం10
- నగరంలో 14 కూడళ్లలో అత్యధికంగా కాలుష్యం
- ఫలితాలివ్వని జాతీయ స్వచ్ఛ వాయువు కార్యక్రమం

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుమ్ము.. పొగతో వాయు కాలుష్యం. గుంటూరు నగరంలో రోజురోజుకు వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. వాహనాల నుంచి వచ్చే పొగ, రోడ్లపై పేరుకుపోతున్న దుమ్ము ధూళి గాలిలో కలిసి పోతోంది. దీనిని పీలుస్తున్న నగరవాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. నగరంలో యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ(ఏఏక్యూ - పరిసరాల గాలి నాణ్యత) అంతంత మాత్రంగానే ఉంటున్నది. కేంద్ర కాలుష్య నియంత్రణ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే నగరంలో ప్రజలు పీల్చే గాలిలో స్వచ్ఛత అంతంత మాత్రమేనని తేలింది. పర్టిక్యులేట్ మ్యాటర్ 10 మైక్రోమీటర్ (పీఎం 10) కొంత తగ్గడం, మళ్లీ పెరుగుతోంది. కరోనా లాంటి లాక్‌డౌన్ రోజుల్లో కూడా గాలిలో కాలుష్యం కొనసాగిందంటే పరిస్థితిని అంచనా వేయొచ్చు. పరిశ్రమలు, రోడ్ల నిర్మాణాలకు రోజుల తరబడి కాలయాపన వంటి కారణాలతో గాలిలో దుమ్ము, ధూళి శాతం తగ్గడంలేదు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద 2025 నాటికి పీఎం 10ని 30 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఉన్న ఏఏక్యూ డేటాని ప్రామాణికంగా తీసుకున్నారు. ఆ సంవత్సరంలో పీఎం 10 66గా ఉన్నది. 2018-19లో ఇది 49కి తగ్గింది. దాంతో నగరంలో ప్రజలు పీల్చే గాలి సురక్షితమైనదని తేలింది. అయితే 2019-20 నుంచి మళ్లీ పెరగడం ప్రారంభమైంది. నగరపాలక సంస్థకు జాతీయ స్వచ్ఛ వాయువు కార్యక్రమం కింద కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిధులను కేటాయించినా ఆశించిన ఫలితం లేదు. 2019-20 నుంచి కేంద్రం ఇప్పటివరకు రూ.17.343 కోట్లు విడుదల చేయగా అందులో కేవలం రూ.10.589 కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగారు. ఈ నిధులతో గాలిలో నాణ్యత పెంచడానికి, వేస్టు, బయోమాస్ డంపింగ్, పరిశ్రమలు, వాహనా లు, రోడ్ల నిర్మాణం, కూల్చివేతలు వంటి వాటి ల్లో దుమ్ము, ధూళి శాతం తగ్గించడానికి వినియోగించాలని స్పష్టం చేసింది. అయితే గత ఐదేళ్లలో మార్పు రాలేదు. నగరంలో ట్రాఫిక్ పోలీసు, రవాణాశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి కాలుష్యం వెదజల్లే 14 హాట్‌స్పాట్‌లను గుర్తించారు. ఇందులో కొన్ని నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయానికి సమీపంలోనే ఉండటం విశేషం.

సంవత్సరం	పీఎం10
2017-18	66
2018-19	49
2019-20	58
2020-21	56
2022-23	60
2023-24	61
2024-25(సెప్టెంబరు)	57

కాలుష్య కేంద్రాలు

- హిందూ కళాశాల కూడలి
- హిమని స్వీట్స్ సెంటర్
- రాధాకృష్ణ థియేటర్ (పాతబస్టాండ్)
- ఆర్టీసీ బస్టాండ్
- కొత్తపేట భగత్‌సింగ్‌బొమ్మ
- బోసుబొమ్మ
- ఎత్తురోడ్డు సెంటర్
- చుట్టుగుంట సర్కిల్
- అరండల్‌పేట 10వ లైను
- లాడ్జి సెంటర్
- బృందావన్‌గార్డెన్స్ సర్కిల్
- మదర్ థెరిస్సా విగ్రహం కూడలి
- గుజ్జనగుండ్ల సర్కిల్
- గడ్డిపాడు రిలయన్స్ పెట్రోల్ బంకు సెంటర్

మేల్కోకపోతే ముప్పే

ఇప్పటికే ప్రమాద ఘంటికలు మోగుతున్న దృష్ట్యా ప్రభుత్వ శాఖలు, ఎన్‌జీవోలు, ప్రజలు మేల్కోవాలి. కాలుష్యానికి కారణమౌతున్న వాటిని నిరోధించాలి. ముఖ్యంగా గూడ్స్ వాహనాలపై టార్పాలిన్ పట్టాలు కప్పేలా చూడాలి. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు నగరంలోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా ఆంక్షలు విధించాలి. సిగ్నల్ లైట్ల వద్ద వాహనాల ఇంజన్లు ఆపి గ్రీన్‌సిగ్నల్ పడడానికి నాలుగైదు సెకన్ల ముందుగా స్టార్ట్ చేసుకునేలా చూడాలి. కాలం చెల్లిన వాహనాలను తుక్కుగా మార్చాలి. ప్రజా రవాణాలో సీఎన్‌జీ వాహనాల సంఖ్యని పెంచేలా చూడాలి. పరిశ్రమలు, క్వారీలను పర్యవేక్షిస్తూ కాలుష్య కారకాలను వెదజల్లకుండా చూడాలి.





గుంటూరు నగరంలో దుమ్ము..

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

- నేడు విడుదల చేయాల్సిన నోటిఫికేషన్ నిలిపివేత
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- సిద్ధమైన ఓటర్ల జాబితాలు.. ఏడు లక్షల మందికి ఓటు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ఎన్నికలకు అధికారులు సిద్ధమవగా.. తమకు గ్రామాల్లో పట్టు ఉందని నిరూపించుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాలు పన్నుతుండగా ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను వాయిదా వేసింది. ఎన్నికలకు సంబంధించి గురువారం విడు దల చేయాల్సిన నోఫికేషన్ ను ప్రభుత్వం నిలిపివేసిం ది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎన్నికలను ప్రభుత్వం తాత్కా లికంగా వాయి దా వేసింది. త దుపరి ఉత్తర్వులు విడుదలయ్యే వరకు ఎన్నికల ప్రక్రియను నిలిపి వేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ) పరిధిలోని టీసీల వారీగా రైతుల జాబితాలను సిద్ధం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 274 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటి పరిధిలో 2,628 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో దాదాపు 12 టీసీలు ఉన్నా యి. ఒక్కొక్క సంఘం పరిధిలో 2,500 మంది నుంచి 3,000 వరకు రైతులను ఓటర్లుగా నమోదు చేశారు. సుమారు ఏడు లక్షల మందిని ఓటర్లుగా అధికారులు గుర్తించారు. ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహిం చేందుకు 2,628 టీసీల వారీగా ఓటర్ల జాబితాలను అధికారులు విడుదల చేశారు. తొలుత టీసీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వ ఆదేశాలతో నోటిఫికేషన్ నిలిచిపోయింది. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా కైవాసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.

మునిపల్లెలో చారిత్రక ఆనవాళ్లు గుర్తింపు


మునిపల్లెలోని వీరగల్లు శాసనం

పొన్నూరుటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం మునిపల్లె గ్రామంలో పురావస్తు చారిత్రక ఆనవాళ్లు అయిన వీరగల్లు శాసనం లభ్యమైనట్లు యువ పురావస్తు పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్ రెడ్డి బుధవారం తెలిపారు. మునిపల్లె గ్రామానికి చెందిన పల్లెపోతల సుబ్రహ్మణ్యం, సూధనగుంట శ్రీనివాస్ ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం శ్రీనాధ్‌రెడ్డి మునిపల్లె గ్రామానికి వచ్చి శాసనాలను పరిశీలించారు. అగస్తేశ్వర ఆలయంలో నంది బొమ్మ చెక్కిన శిలాఫలకంపై ఉన్న శాసనాన్ని పరిశీలించారు. ఈ శాసనం భూమిలోపల ఉండగా, ఇటీవలే ఆలయ మరమ్మతుల్లో భాగంగా పైకి లేపారు. మట్టి లోపల ఉండటం చేత ఈ శాసనం చాలా భాగం చదవటానికి వీలు లేకుండా పోయింది. కేవలం కొద్దిపాటి అక్షరాలు మాత్రమే గుర్తించ గలుగుతున్నట్లు శ్రీనాథ్ రెడ్డి వెల్లడించారు. 18, 19 శతాబ్దాలకు చెందిన తెలుగు లిపిలో గ్రామ విషయాలు ఉన్నట్లు చెప్పారు.

గోళ్లమూడిపాడు రోడ్డులో..


వీరగల్లు శాసనాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకులు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి

అలాగే గ్రామ శివారులోని గోళ్లమూడిపాడు రోడ్డులో పంట పొలాల్లో కూరుకుపోయి ఉన్న వీరగల్లు శిల్పాని శ్రీనాథ్ రెడ్డి గుర్తించారు. ఈ శిల్పం పూర్వకాలంలో గ్రామ పెద్ద, ఒక అధికారి, గ్రామ సంరక్షణలో భాగంగా యుద్ధంలో లేదా జంతువులతో పోరాడుతూ మరణించిన వారి గుర్తుగా ప్రతిభను చెక్కినట్లు తెలిపారు. సుమారు మూడు అడుగుల పొడవున్న ఈ వీరగల్లు శిల్పంపై ఒక పురుషుడు, ఇరువైపులా స్త్రీల ప్రతిమలు ఉన్నాయి. ఇవి గ్రామ చరిత్రకు ఆనవాళ్లు అని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు

నరసరావుపేట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పమిడిపాడు గ్రామానికి చెందిన కొల్లా సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తాటికుర్తి రవికిషోర్‌రెడ్డి, గాడిపర్తి వంశీకృష్ణ, గాడిపర్తి దయాసాగర్, గాడిపర్తి ప్రసాద్, గాడిపర్తి శ్రీనివాసరావు, పొదిలి మదార్‌సాహెబ్‌లపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు. కొల్లా సాంబశివరావుకు నరసరావుపేట మండలం అర్వపల్లి గ్రామంలో 6 ఎకరాల పొలం ఉందనీ, 2022 మార్చి 18న ఈ ఏడుగురు తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, తనను బెదిరించి, తనపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

పత్తి కొనుగోళ్లలో లోటుపాట్లపై కేంద్రానికి నివేదిక

- సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ


మార్కెటింగ్, సీసీఐ అధికారులతో మాట్లాడుతున్న విజయ్ కురదగీ

గుంటూరు సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పత్తి కొనుగోళ్లలో లోటుపాట్లును గుర్తించి కేంద్రానికి నివేదిక అందజేయనున్నట్లు సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ వెల్లడించారు. బుధవారం ఆయన గుంటూరు, పల్నాడు జిల్లాలోని సీసీఐ కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ పత్తి రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల సమీపంలోని గాయత్రి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో స్వయంగా తేమశాతం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ బూసిమి రాజబాబు ఉమ్మడి జిల్లాలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీసీఐ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని తేమశాతంలో సడలింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు నోటిపై చేసిన జిన్నింగ్ మిల్లుల యజమానులతో కూడా సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

మరో అధికారి రాక...

ఉమ్మడి జిల్లాలో సీసీఐ పనితీరును పరిశీలించేందుకు కేంద్రం నుంచి మరో మహిళా అధికారి రానున్నారు. గురువారం ఆమె ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిసింది. పత్తి కొనుగోలు వ్యవహారంలో సీసీఐ పనితీరును పరిశీలించి, సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఫిర్యాదు, విజ్ఞప్తి మేరకు ఈ అధికారులను కేంద్రం ఆఘమేఘాల మీద గుంటూరు జిల్లాకు పంపుతున్నారు.

ఎనిమిది ప్రారంభం... నాలుగు సెంటర్లలో కొనుగోళ్లు

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 15 జిన్నింగ్ మిల్లులను నోటిపై చేశారు. అయితే వాటిలో ఎనిమిది సెంటర్లు ప్రారంభించినా, కేవలం నాలుగు సెంటర్లలో మాత్రమే పత్తి కొనుగోలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల కూడా రైతులు పత్తి అమ్మకాలకు ఇబ్బంది పడుతున్నారు. కొందరు బయ్యర్లు అతి భయంతో కొనుగోలుకు దూరంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మొక్కజొన్న దిగుబడి పెంచే దిశగా పరిశోధనలు


డాక్టర్ సంతోష్ కుమార్ సింగ్‌ను సన్మానిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి దేవి

గుంటూరు సిటీ, తాడికొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు నికరాదాయాన్ని అందించే మొక్కజొన్న దిగుబడి పెంచే దిశగా పరిశోధనలు జరుపుతున్నట్లు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి దేవి వెల్లడించారు. బుధవారం తాడికొండ మండలం లాం లోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ సీనియర్ అగ్రికల్చరల్ స్పెషలిస్ట్ డా.సంతోష్ కుమార్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా విస్తరణ సంచాలకులు డా. జి.శివన్నారాయణ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ అధికారులతో రాష్ట్రంలో వ్యవసాయ స్థితిగతులు, విశ్వవిద్యాలయ పాత్ర మొదలగు విషయాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి దేవి మాట్లాడుతూ వరి, వేరుశనగ, అపరాలు, చిరుధాన్యాలు మారిన వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ మేలైన దిగుబడినిచ్చే పంటల రకాలను తయారు చేయడంలో విశ్వవిద్యాలయం ముందుందని తెలిపారు. పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుంచి విడుదలైన వరి రకాలు పలు రాష్ట్రాల్లో అధికంగా సాగులో ఉన్నాయని తెలియజేశారు. డాక్టర్ సంతోష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ నికర సాగు భూమి రోజురోజుకీ తగ్గుతున్న పరిస్థితుల్లో మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ, దిగుబడి పెరిగే విధంగా పరిశోధనలు చేయాలని, మొక్కజొన్నలో ముఖ్యంగా పిండి పదార్థం ఎక్కువ ఉండే రకాలను తయారు చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ డా.జి.రామచంద్రరావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్‌రావు, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ, డీన్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ బి.శ్రీలక్ష్మి, డీన్ ఇంజినీరింగ్ డా.ఎ.మణి, యూనివర్సిటీ లైబ్రేరియన్ డా.పి.సాంబశివరావు పాల్గొన్నారు. డాక్టర్ సంతోష్ కుమార్ సింగ్‌ను సన్మానించారు.

రూ.కోట్లలో.. కిక్

(5పేజీ తరువాయి)

అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అప్పటి వరకు కొనసాగుతున్న మద్యం పాలసీని మార్చేశారు. ప్రభుత్వ దుకాణాల స్థానే ప్రైవేటు దుకాణాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉండే కేవలం నగదు లావాదేవీలు తొలగించి డిజిటల్ పేమెంట్స్‌ను కూడా అమల్లోకి తెచ్చారు. గత నెల దసరా పండుగ రోజు నుంచి కొత్త మద్యం షాపులు వెలిశాయి. అప్పటి వరకు కేవలం జేబులో నగదు ఉంటే మాత్రమే మద్యం కొనుక్కునే అవకాశం ఉండేది. డిజిటల్ లావాదేవీలు అమల్లోకి రావడంతో క్రెడిట్‌కార్డులు ఉన్నవారు సైతం ఎంచక్కా వైన్ షాపులకు వెళ్ళి మద్యం కొనుగోలు చేస్తున్నారు. దసరా పండుగ ముందు వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరికే మద్యం బ్రాండ్ల పేర్లు కూడా వింతగా ఉండేవి. బూమ్..బూమ్, బ్రిటీష్ ఎంపైర్ వంటి బీర్లు, ఆంధ్రగోల్డ్ విస్కీ, హైదరాబాద్ బ్లూ విస్కీ, ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీలు వంటివి మాత్రమే అందుబాటులో ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేసిన కొత్త మద్యం షాపుల్లో ఏ బ్రాండ్ మద్యమైనా అందుబాటులోకి వచ్చింది. కింగ్ ఫిషర్, బడ్వైజర్, నాకౌట్ వంటి ప్రముఖ బ్రాండెడ్ బీర్లు దొరుకుతున్నాయి. దీంతో ఈ నెల రోజుల్లో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. గత నెల 16 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు అంటే 30 రోజుల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూ.259 కోట్ల 19లక్షల అమ్మకాలు జరిగాయి. ఇందులో రూ.208 కోట్ల విలువ చేసే మద్యం కేవలం కొత్తగా ఏర్పాటు చేసిన వైన్ షాపుల ద్వారానే జరిగింది. మిగతా అమ్మకాలు బార్లు, క్లబ్‌లలో జరిగాయి. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో భాగంగా గుంటూరు జిల్లాలో 127, పల్నాడు జిల్లాలో 129, బాపట్ల జిల్లాలో 117 కొత్తగా వెలిశాయి. అయితే బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కంటే గుంటూరు జిల్లాలోనే మద్యం దుకాణాల ద్వారా ఎక్కువ అమ్మకాలు జరిగాయి. పల్నాడు జిల్లాలో రూ.93 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.86 కోట్ల మద్యం అమ్మకం జరిగింది. ఇక గుంటూరు జిల్లాలో రూ.115 కోట్లకుపైగా విలువ చేసే మద్యం విక్రయించారు. ఇందులో ఒక గుంటూరు నగరంలోనే రూ.50 కోట్ల మద్యాన్ని కేవలం దుకాణాల ద్వారానే కొనుగోలు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాల్లోనే రూ.34 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.16 కోట్ల అమ్మకాలు జరిగాయి. చిలకలూరిపేట ప్రాంతంలో అత్యధికంగా రూ.13 కోట్లకుపైగా అమ్మకాలు జరిగాయి. అక్టోబరు 16కు ముందు జగన్ హయాంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండేవి. అప్పటి అమ్మకాలతో బేరీజు వేసుకుంటే ప్రస్తుతం ఇంచుమించు నెలకు రూ.20 కోట్ల అమ్మకాలు పెరిగాయి.

సరఫరాకు మించి రూ.99 మద్యానికి డిమాండ్

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా డిస్టలరీ కంపెనీలకు ఇచ్చిన ఆదేశాల మేరకు నాణ్యతతో కూడుకున్న చౌక మద్యం రూ.99కే అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో తొలుత ఈ మద్యం అందుబాటులో లేదు. అయితే కొద్ది రోజులు ఆలస్యంగానైనా సరే మార్కెట్లోకి రూ.99 మద్యం వచ్చింది. ఈ నేపథ్యంలో వీఎస్‌వోపీ వారి బ్రాందీ(ట్రోపికాన)కు డిమాండ్ విపరీతంగా ఉంది. ఇది డిమాండ్‌కు తగ్గట్లుగా ప్రస్తుతానికి సరఫరా లేదు. దీంతో డిపోల నుంచి షాపుల నిర్వాహకులు కోరినంత ఇవ్వలేకపోతున్నారు. త్వరలో ఈ బ్రాండ్లను కూడా భారీగా డంప్ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

మద్దతు ధర కల్పించటానికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

కొల్లిపర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తూములూరు మర్రెడ్డి వారి కల్యాణ మండపంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ అధ్యక్షత జరిగిన సమావేశంలో నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 3.4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 45 క్లస్టర్స్ ద్వారా 156 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1740 ఇస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చేటప్పుడు 17 శాతం తేమ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. 17 శాతం కంటే తేమ ఎక్కువ ఉంటే తేమ శాతంను బట్టి ధాన్యానికి ధర నిర్ణయిస్తారని తెలిపారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమకానున్నట్లు చెప్పారు. మిల్లర్ల వద్ద ధాన్యానికి మంచి ధర వస్తే రైతులు అమ్ముకోవచ్చు అని తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్‌కలెక్టర్ సంజనాసింహ, సివిల్ సప్లయ్స్ అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. సర్పంచి అరుణాబాయ్, ఎంపీపీ భీమవరపు పద్మావతి, తహసీల్దార్ సిద్ధార్థ, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్స్ డీఎం శ్రీలక్ష్మి, జీడీసీఎమ్ఎస్ బ్రాంచి మేనేజర్ హరిగోపాల్, ఏడీఏ ఉషారాణి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రుణాల చెల్లింపు నగదు రూ.10 లక్షలు గోల్‌మాల్

పొన్నూరుటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామంలో పొదుపు మహిళలకు సంబంధించి రుణాల చెల్లింపు నగదును యానిమేటర్ స్వాహా చేసిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామంలో ఓంకార్, శాంతి గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. ఓంకార్ గ్రామ సమాఖ్య యానిమేటర్‌గా పని చేస్తున్న అరుణ గత మార్చి నెలలో మృతి చెందారు. ఆ తరువాత మరో యానిమేటర్ ఈ ఓంకార్ గ్రామ సమాఖ్యకు సంబంధించి రుణ చెల్లింపుల పర్యవేక్షణ చేశారు. అయితే ఏపీఎం గానీ, సీసీలు గానీ ఇందుకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని సమాచారం. ఓంకార్ గ్రామ సమాఖ్యలో 27 పొదుపు సంఘాల్లో 300 మంది సభ్యులు ఉన్నారు. ఈ గ్రామ సమాఖ్యకు శ్రీనిధి రుణాలు, స్వర్ణ జయంతి గ్రామ స్వరాజ్ యోజన పథకం, ఉన్నతి పథకాల నుంచి సభ్యులకు రుణాలు మంజూరైయ్యాయి. రుణాలు పొందిన మహిళలు ప్రతి నెలా వాయిదాల నగదును గ్రామ సమాఖ్యకు చెల్లిస్తారు. అయితే ఈ నగదును యానిమేటర్, సీసీ ఇద్దరూ కలిసి వసూళ్లు చేశారని పొదుపు సంఘాల మహిళలు ఆరోపిస్తున్నారు. యానిమేటర్ అరుణ మృతి చెందిన తరువాత నాలుగు నెలల పాటు వేరొక గ్రామ యానిమేటర్ రుణాల నగదు చెల్లింపులను పర్యవేక్షించారు. ఈ కాలంలో సుమారు రూ.3.50 లక్షల నగదు గోల్‌మాల్ అయినట్లు సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై పొదుపు మహిళలు డ్వాక్రా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఆరా తీసిన అధికారులకు మరికొన్ని అక్రమాలు తెలిసినట్లు సమాచారం. శాంతి గ్రామ సమాఖ్యలో కూడా రూ.6 లక్షల నగదు స్వాహా అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెలా పొదుపు మహిళలు చెల్లిస్తున్న రుణాలను బ్యాంక్‌లో జమ చేయకుండా యానిమేటర్ స్వాహా చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఆరోపణలపై ఏపీఎం జోయబాబును వివరణ కోరగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓంకార్ గ్రామ సమాఖ్యలో అక్రమాలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

వీధి వ్యాపారులపై ఆంక్షలు తగదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తోపుడు బండ్లతో, బుట్టలతో పండ్లు, కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న తమపై మున్సిపల్ అధికారుల ఆంక్షలు తగవంటూ చిరువ్యాపారులు రోడ్డెక్కారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మార్కెట్ ప్రాంతంలో తోపుడు బండ్లు, బుట్టలతో వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులను మున్సిపల్ అధికారులు వ్యాపారం చేయవద్దంటూ ఆదేశించడంతో ఆందోళన చోటుచేసుకుంది. కూరగాయలు, పండ్లు రోడ్లపై పారబోసి చిరువ్యాపారులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ రోడ్లను ఆక్రమించుకుని పెద్దపెద్ద షాపులను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకునేవారు మున్సిపల్ అధికారులకు కన్పించడంలేదా అని ప్రశ్నించారు. తోపుడు బండ్లతో ఎవరికీ ఇబ్బంది లేకుండా చిరువ్యాపారాలు చేసే మాపైనే ఆంక్షలు విధించడం అన్యాయం అన్నారు. ఇదిలా ఉండగా, తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్లకు అడ్డంగా బండ్లను పెట్టి వ్యాపారం చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందనీ, ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు అంటున్నారు.

జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు-2024

గుంటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రావి రంగారావు సాహిత్య పీఠం జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు- 2024కు ఆహ్వానం పలికింది. బుధవారం ప్రకటించింది. 2020 నుండి 2024 సంవత్సరం వరకు ప్రచురించిన పద్యం, వచన కవిత,దీర్ఘ కవిత, గేయం, లఘు, కవితలు, బాల గేయాలు మొదలైన కవిత్వ సంపుటాలు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ నర్రా ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీకి ఒక్క పుస్తకం పంపితే చాలని, 'కన్వీనరు, రావి రంగారావు సాహిత్య పీఠం, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్ తూర్పు, 5వ లైను, గోరంట్ల, గుంటూరు- 522034 చిరునామాకు డిసెంబర్ 31 2024 లోగా పంపించాలని పేర్కొన్నారు. ఎంపికైన కవులను వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 సాయంత్రం 6 గంట లకు స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళా వేదికలో జరిగే సాహిత్య సభలో సత్కరించనున్నట్లు తెలిపారు. ఎంపికైన కవులకు ఒక్కొక్కరికి రూ. 2 వేల నగదు, జ్ఞాపికను అందజేసి సత్కరించనున్నట్లు వివరించారు.



ఉచిత పైల్స్ క్యాంపులో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఉమాశంకర్ తదితరులు

'లలితా సూపర్ స్పెషాలిటీస్'లో ఉచిత పైల్స్ క్యాంపు

గుంటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పైల్స్ (మొలలు) దినోత్సవం సందర్భంగా గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో సీనియర్ సర్జన్ డాక్టర్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఉచిత పైల్స్ క్యాంపు బుధవారం జరిగింది. ఈసందర్భంగా సుమారు 100 మంది పేషంట్లను పరీక్షించి అందులో 23 మందికి ఆపరేషన్ అవసరమని సూచించారు. అనంతరం డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ఆధునిక వైద్య పరికరాలు ఉపయోగించి చికిత్సలు అందిస్తున్నామన్నారు. వ్యాధులు అనేక విధాలుగా నొప్పిని కలిగించినప్పటికీ వాటి చికిత్సలు సులభంగా, తక్కువ నొప్పితో ఉండాలని, అటువంటి ప్రయోజనం కోసం లలితా హాస్పిటల్‌లో గత కొన్ని సంవత్సరాలుగా మినిమల్ యాక్సిస్ (లాపరోస్కోపి) లేజర్ సహాయంతో ఆపరేషన్ చేస్తున్నట్లు చెప్పారు. ఎండోస్కోపిక్ థైరాయిడెక్టమీ, లాపరోస్కోపీ ద్వారా పలు అరుదైన ఆపరేషన్‌లు కూడా చేస్తున్నామని, పైల్స్ అంటే చాలా మంది భయం, సిగ్గు కారణంగా తీవ్రత ఎక్కువయ్యే వరకూ బయట పడరని అన్నారు. అలాంటి వాటికి అంటే ఫిజర్, ఫిస్టులా, పైలోనైడల్ సైనస్ మొదలైన సమస్యలకు కూడా లేజర్ ఉపయోగించి తక్కువ ఖర్చుతో సులభంగా నొప్పి లేకుండా చేయవచ్చని, కిడ్నీలో రాళ్ళున్న వారికి లేజర్ ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. స్త్రీల గర్భాశయంలో ఏర్పడే పెద్ద గడ్డలను (ఫైబ్రాయిడ్స్) సైతం నీడిల్ హోల్ సర్జరీ (ఎంబోలెక్టమీ) ద్వారా కరిగించవచ్చని అన్నారు. వెరికోస్ వెయిన్స్ చాలా సేపు నిలబడే వారికే కాదు, చాలా మందికి వివిధ కారణాల వల్ల కూడా కలుగుతాయన్నారు. ఈ సమస్యకు లేజర్ చికిత్స ద్వారా సులభమైన పరిష్కారం అందించగలమని వివరించారు. వివిధ రక్త నాళాలలో ఏర్పడే రక్తపు గడ్డల వలన రక్త సరఫరా తగ్గిన వారికి పిన్ హోల్ సర్జరీలు ద్వారా ఆధునిక చికిత్సను తమ హాస్పిటల్‌లో చేస్తున్నట్లు వివరించారు.

మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్

మేడికొండూరు నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్య రహిత సమాజ స్థాపనకు యువత సహకారం అవసరమని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవి కుమార్‌రెడ్డి అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖా నెహ్రూ యువకేంద్ర గుంటూరు సౌజన్యంతో పేస్ సొసైటీ ఆధ్వర్యంలో పేరేచర్ల సమీపంలోని యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశా లలో బుధవారం జరిగిన డ్రగ్ ప్రివెన్షన్‌పై కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ పామిశెట్టి బాల స్వామి అధ్యక్షత వహించారు. రవి కుమార్ రెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ వి.అరుణ కుమారి మాట్లాడుతూ యువత దైనందిన జీవితంలో మంచి అలవాట్లు పాటించాలని, డ్రగ్స్ కి దూరం ఉండాలని అన్నారు. డిపార్ట్‌మెంట్ తరపున పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రదర్శించి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం యశోధరరాణి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌లు పీఆర్‌కె. మూర్తి, మాధవి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి, పేస్ సొసైటీ కార్యదర్శి పారుపల్లి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.రమేష్ తదితరులతో పాటు యూనివర్సల్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సిమెంటు కంపెనీ కార్మికుల అర్ధనగ్న నిరసన

తాడేపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిమెంటు కంపెనీ కార్మికుల పట్ల ఏసీసీ, ఎన్నార్ఐ, సంబంధిత భూ యజమానులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పోరాట శిబిరంలో కార్మికులు బుధవారం అర్ధనగ్న నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ ఐక్య పోరాటాల ద్వారానే ఫలితాలు వస్తాయని అన్నారు. మంత్రి నారా లోకేశ్ ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కె.స్టీవెన్, ఆశీర్వాదం, అంకయ్య, సూర్యప్రకాష్, సుబ్బారావు, నాగేశ్వరరావు, రమాదేవి, జానీ, నవనీతం, నరసింహారావు దుర్గమ్మ, భవాని, సామ్రాజ్యం, శారద, యోహోషువ, శాస్త్రి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. బుధవారంతో దీక్షలు 24వ రోజుకు చేరుకున్నాయి.

ఏళ్ళ తరబడి సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

- ఏటీ అగ్రహారం ప్రధానరహదారిలో తుది దశకు చేరని పనులు
- వెల్లువెత్తుతున్న విమర్శలు
- దుమ్ము, ధూళితో స్థానికులకు సమస్య


గుంటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి విస్తరణ పనులు ఏళ్ళ తరబడి కొనసాగుతున్నాయి. రహదారి విస్తరణ పనులతో స్థానిక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అయినప్పటికీ పనులు తుది దశకు చేరకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనుల ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. గతంలో 2006లోనే రోడ్డు విస్తరణ పనులకు ప్రతిపాదనలు చేసి మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. అది మరుగున పడటంతో ఆ తర్వాత ఆ మాస్టర్ ప్లాన్‌ను కాస్త మార్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2021 తరువాత ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ఇందుకోసం స్థానికుల నుంచి అభిప్రాయ సేకరణ పేరుతో తీసుకున్న అభిప్రాయాలను కూడా బుట్టదాఖలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ నాయకులకు, వారి అనుకూలమైన వారికి మేలు చేసేలా రోడ్డు విస్తరణలో ప్లాన్‌ను రూపొందించి రోడ్డును వంకరలు తీశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పాటు పనుల్లో వేగం లేకపోవడంతో మూడు అడుగులు ముందుకు, ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. విస్తరణలో నష్టపోయిన వారిలో నేటికీ అనేక మందికి నష్టపరిహారం కూడా చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొంత మంది భవనాల యజమానులు న్యాయస్థానాలను ఆశ్రయించటం కూడా విస్తరణ పనుల్లో జాప్యానికి మరో కారణంగా చెబుతున్నారు. విస్తరణలో కొంతభాగంలో సర్కారు డొంక స్థలం ఉన్నప్పటికీ ప్రైవేటు స్థలాన్ని తీసుకొని పరిహారం కోసం ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున చిల్లుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటీ అగ్రహారంతో పాటు చుట్టుగుంట, శాంతినగర్, మల్లారెడ్డినగర్ పరిసర ప్రాంత ప్రజలు నిత్యం పెద్దఎత్తున ఈ రహదారి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. విస్తరణ పనులు ఏళ్ళ తరబడి చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోకాలిలోతు గుంతలు, మొనతేలిన రాళ్ళతో ఉన్న ఈ రోడ్డులో రాకపోకలు సాగించాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఆ రోడ్డులో రాకపోకలు సాగించడం మానేసి శ్రీరామ్‌నగర్ మెయిన్ రోడ్డువైపు నుంచి వెళ్తున్నవారు లేకపోలేదు. అంతేగాక రోడ్డు విస్తరణపై ఇప్పటికే జీఎంసీ కమిషనర్‌కు స్థానికులు పలుసార్లు వినతిపత్రాలు అందజేశారు. మెయిన్ రోడ్డు విస్తరణ పనులతో దుమ్ము, ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనున్న గృహాల రంగులు కూడా మాయమై దుమ్ముతో నిండుపోతున్నాయి. ఇక రాత్రి సమయాల్లో ఈ రోడ్డులో రాకపోకలు సాగించడం ప్రాణసంకటంగా మారిందని వాపోతున్నారు. వర్షాకాలంలో రోడ్డు వాగులను తలపిస్తోంది. ఇప్పటికైనా విస్తరణ పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా రోడ్డు విస్తరణ


- సింగ్ నరసింహారావు



80 అడుగుల రోడ్డు విస్తరణను అస్తవ్యస్తంగా రూపొందించారు. పాము తరహాలో వంకర్లు తిప్పుతూ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. రోడ్డు చివరలో ఫ్రీ లెఫ్ట్ ప్లాన్‌ను అమలు చేయలేదు. సర్కారు వారి డొంక స్థలం ఉన్నప్పటికీ దాన్ని విస్తరణలో తీసుకోకుండా ప్రైవేటు స్థలాలను, పీకలవాగును కూడా రోడ్డుగా చూపారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణం ఎలా చేపడతారో అర్థం కావడం లేదు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్, కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినా ఫలితం లేదు.



వంకరలు తిరిగిన రోడ్డు డివైడర్



పీకలవాగుపై నుంచి రోడ్డుకు మార్కింగ్ చేసిన జీఎంసీ అధికారులు



అసంపూర్తి కల్వర్టు నిర్మాణంతో రోడ్డు

బీఆర్ స్టేడియం అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలి

- శాసనసభలో ప్రస్తావించిన తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని బీఆర్ స్టేడియం రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోకుండా పోయిందని, దీనిని అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. శాసనసభలో బుధవారం బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధిపై ఆయన మాట్లాడారు. గత వైసీపీ ఎమ్మెల్యే తన సొంత లబ్ధి కోసం బీఆర్ స్టేడియం అభివృద్ధికి కేటాయించిన ప్రజాధనాన్ని రూ.65 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి లబ్ధి పొందేందుకు ప్రయత్నించాడని, 'ఆడుదాం ఆంధ్ర' అంటూ రూ.119 కోట్లు దుర్వినియోగం చేసి గత పాలకులు లబ్ధి పొందారని ఎమ్మెల్యే ఆరోపించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రోజూ వేలాదిమంది వాకింగ్ చేసే ట్రాక్‌పై కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, స్టేడియం అభివృద్ధికి ప్రభు త్వం చొరవ తీసుకోవాలని కోరారు. జనరిక్ మందుల గురించి ఆయన ప్రస్తావించారు. ఈ విషయమై ప్రజల్లో అవగాహన పెంచాలని, కొన్ని ప్రముఖ ఫార్మా కంపెనీలు తక్కువ ఖర్చుతో తయారయ్యే మందులను ఎక్కువ ధరలకు అమ్ముతున్నాయని, అందువల్ల ప్రజలపై భారం పడుతోందని, ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకుని, మండల స్థాయిలో, గ్రామాల్లో జనరిక్ స్టోర్లను ఏర్పాటు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

అసాంఘిక చర్యలకు అడ్డాగా ఖాళీ స్థలాలు

- శాసనసభలో ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలు అసాంఘిక కార్యకలాపాలకు, ప్రమాదాలకు, అనారోగ్యానికి కేంద్రాలుగా మారుతున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. జనజీవనానికి ఇబ్బందికరంగా మారిన ఈ అంశంపై శాసనసభలో బుధవారం ఆమె ప్రస్తావించారు. ఈ విషయాన్ని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. పశ్చిమ నియోజకవర్గంలో ఈ సమస్య అత్యంత తీవ్రంగా వుందని సభలో వివరించారు. ప్రతి డివిజన్‌లో సుమారు 10 నుంచి 15 వరకు ఖాళీ స్థలాలు ఉంటాయని, ప్రధానంగా 21, 25, 28, 29, 36, 39, 43 డివిజన్లలో అలాంటివి అధికంగా ఉన్నాయని తెలిపారు. ఆయా స్థలాల యజమానుల నిర్లక్ష్యం వలన వాటిల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి, చెత్త, విషసర్పాలు చేరుతున్నాయని, మురుగు నీరు నిల్వవుండి అనారోగ్యానికి కారణమవు తున్నాయని చెప్పిన ఆమె, ఇందుకు సంబం ధించిన ఫొటోలను చూపించి వివరించారు. ఈ సమస్యపై మంత్రి దృష్టి సారించాలని ఒక నిర్ణయం తీసుకుని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు

ఏఈఎల్‌సీ,ఆర్‌సీఎం ప్రతినిధులతో సమావేశం

- ఆర్‌ఓబీ నిర్మాణానికి సహకరిస్తామనడంపై కమిషనర్ అభినందన

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరవాసుల చిరకాల వాంఛ శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణానికి అనుమతులు రావడం సంతోషమని, నిర్మాణానికి సంపూర్ణంగా సహకరిస్తామన్న ఏఈఎల్‌సీ, ఆర్‌సీఎం సంస్థలకు ప్రత్యేక అభినందనలు తెలిపుతున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో బుధవారం ఏఈఎల్‌సీ,ఆర్‌సీఎం ప్రతినిధులతో సమావేశం జరిగింది. తొలుత ఆర్‌అండ్‌బీ అధికారులు ఆర్‌ఓబీ నిర్మాణ ప్లాన్‌ని, జీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు ప్రభావిత భవనాల వివరాలు, జీఎంసీ నుండి అందించే నష్టపరిహారం వివరాలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏఈఎల్‌సీ,ఆర్‌సీఎంలకు చట్టపరంగా అందాల్సిన నష్టపరిహారాలను త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుండి ఎదురు చూస్తున్న శంకర్ విలాస్ ఆర్‌ఓబీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపినందున రోడ్డు విస్తరణ 120 అడుగులకు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్థానిక అరండల్‌పేట, బ్రాడీపేట వైపు ప్రభావిత భవనాల యజమానులతో సమావేశమైనట్లు చెప్పారు. ఏఈఎల్సీ ఆర్సీఎం ప్రతినిధులు మాట్లాడుతూ భవనాలు ఏ మేరకు ప్రభావితం అవుతాయో మార్కింగ్ చేయాలని కమిషనర్‌ని కోరారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, సిస్టర్ ఇన్నాసమ్మ, డాక్టర్ ఆని, (సెయింట్ జోసఫ్), డాక్టర్ కెఎంఎల్ శాస్త్రి, కె.మోసెస్ ఆర్నాల్డ్ (ఏఈఎల్సి), డాక్టర్ కనపాల జోసఫ్ (ఏసి కాలేజి), టి.రవి మోహన్ రెడ్డి (సెయింట్ జోసఫ్ హాస్పిటల్), టి.రితేష్ (జెఎంజె) పాల్గొన్నారు.

ఉద్యోగులు పెన్‌డ్రైవ్ కొంటున్నారా..జాగ్రత్తలు పాటించాలి

- రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య

గుంటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు పెన్ డ్రైవ్ కొనేటప్పుడు కొన్ని సూచనలు పాటించాలని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. సమాచారాన్ని సులభంగా అందించటమే కాదు నిక్షిప్తం చేయటానికి అనేక పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అందులో పెన్ డ్రైవ్ ఒకటి, కళాశాలలకు వెళ్ళే యువతుల వద్ద ఇంకు పెన్ను ఉంటుందో లేదో తెలియదు కానీ పెన్‌డ్రైవ్ మాత్రం తప్పకుండా కనిపిస్తుందన్నారు. ప్రస్తుతం సైడ్ క్యాప్, స్వీల్ రకం కొత్త పెన్‌డ్రైవ్‌లు మార్కెట్లోకి వచ్చాయన్నారు. వీటి సామర్థ్యం 2 జీబీ, 32 జీబీ వరకు ఉంటుందన్నారు. 2 జీబీ, 4 జీబీ పెన్‌డ్రైవ్‌లు ఎక్కువగా వాడుతుంటారన్నారు. ఇవి కంప్యూటర్‌లో త్వరగా తెరచుకోవడమే ఇందుకు కారణమన్నారు. చూడముచ్చటగా ఆకర్షణీయంగా కనిపించే పెన్‌డ్రైవ్‌లు కొంటే మోసపోయినట్లేనన్నారు. ఇందులో కొన్ని నకిలీవి కూడా ఉండొచ్చని, మరి కొన్ని రెండు, మూడు సార్లు మాత్రమే పనిచేస్తాయన్నారు. అందువల్ల నాణ్యత కలిగినవి మాత్రమే ఎంచుకోవాలన్నారు. పెన్‌డ్రైవ్ దుకాణదారు తప్పకుండా వారంటీ ఇవ్వాల్సిందే. వారంటీ ఇవ్వలేదంటే అవి నాసిరకం వస్తువులని గుర్తించా లన్నారు. పేరుపొందిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. పెన్ డ్రైవ్‌ను కంప్యూటర్‌కు కనెక్ట్ చేసే సమయంలో వైరస్ స్కాన్ చేయాలని సూచిం చారు. లేదంటే అందులోని సమాచారానికి వైరస్ సోకి అది కనిపించకుండా పోతుందన్నారు. కొన్ని సమయాల్లో పెన్‌డ్రైవ్ చెడిపోతే కంపెనీకి పంపటానికి ఉప యోగపడుతుందన్నారు. నీటిలో పడకుండా జాగ్రత్త తీసుకోవటంతో పాటు కింద పడకుండా కూడా చూసుకోవాలని వీరయ్య తెలిపారు.




రామిరెడ్డినగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అభివృద్ధి పనుల పరిశీలన తర్వాతే బిల్లుల చెల్లింపు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఆయా పనులను నేరుగా పరిశీలించిన తర్వాతనే బిల్లుల చెల్లింపు చేస్తామని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. స్థానిక నల్ల కుంట, రామిరెడ్డినగర్, రవీంద్రనగర్, శ్యామలానగర్, పట్టాభిపురం, రత్నగిరినగర్, జన్మభూమినగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. నల్లకుంట 8వ లైన్, శ్యామలానగర్ జీరో లైన్‌లో నూతన కల్వ ర్ట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈలను ఆదేశించారు. రామిరెడ్డి నగర్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లపైకి ర్యాంప్‌లు ఉండడం, భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్ల పక్కన ఉండడంపై స్థానిక 94 వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి వెస్కి.అస్మాకి షోకాజ్ నోటీసు ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్య దర్శులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం తమ సచివాలయం పరిధిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. అడ్మిన్, ఎమినిటి కార్య దర్శులు ఆస్తి, నీటి పన్ను బకాయిల వసూళ్లకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అనంతరం బృందావన్ గార్డెన్స్ లోని అన్నమయ్య వాకింగ్ ట్రాక్‌ని పరిశీలించి, ట్రాక్ అభి వృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ ని శాలువాతో సత్కరించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు మధుసూదన్, రమేష్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్ సిగ్గుపడాలి: కనపర్తి



గుంటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తల్లి, చెల్లికి సంబంధాలు అంటగట్టి విష ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి సిగ్గు పడాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో అతి నీచంగా ప్రత్యర్థి పార్టీల మహిళలపై విషం చిమ్మిన సజ్జల భార్గవరెడ్డి ప్రతిభను గుర్తించిన జగన్, ఆయన తండ్రి సజ్జల రామకృష్ణారెడ్డికి వైసీపీ రాష్ట్ర సమ న్వయకర్త పదవిని కానుకగా ఇవ్వడం చూసి ఆ పార్టీ నాయకులే సిగ్గుతో తల దించుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేశ్, అనితపై సభ్య సమాజం తల దించుకునేలా విషప్రచారం చేసిన భారతీరెడ్డి పీఏ వర్రా రవీందర్ రెడ్డి పెట్టిన పోస్టులపై చర్చించే దమ్ము వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటికి ఉందా అని ఆయన సవాల్ విసిరారు. విలువలు, సాంప్రదాయాల గురించి చంద్రబాబుకు చెప్పే స్థాయి వైఎస్ కుటుంబానికి ఎప్పటికీ రాదన్నారు. ప్రజలు తిరస్కరించినా వైసీపీ నేతల్లో పశ్చాత్తాపం కనపడక పోవడం ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు.



భారతీయ విద్యా భవన్‌లో ఎన్‌సీసీ బాలికల విభాగాన్ని ప్రారంభిస్తున్న కల్నల్ సుదర్శన్ తదితరులు

ఎన్‌సీసీలో విద్యార్థినుల భాగస్వామ్యం మరింత పెరగాలి

- లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్

గుంటూరు(విద్య),నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీలో విద్యార్థినుల భాగస్వామ్యం మరింత పెరగాలని, అన్ని పాఠశాలల్లో ఎన్‌సీసీ బాలికల వింగ్ ఏర్పాటు చేయాలని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్ అన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో బుధవారం ఎన్‌సీసీ బాలికల విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థినుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఎన్‌సీసీ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ పర్యవేక్షణాధికారి కొల్లా రాజశేఖరబాబు, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు, పాఠశాల ప్రిన్సిపల్ ఎన్. హేమాంబ, హెచ్ఎం ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీ చైతన్య విద్యార్థులు

ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ

గుంటూరు(విద్య),నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు బుధవారం ట్రాఫిక్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఏజీఎం డాక్టర్ అంజయ్య ప్రారంభించారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సీటుబెల్టు, హెల్మెట్ ధరించాలని ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరుతూ వాహనచోదకులకు గులాబీపూలు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ మూర్తి, ప్రిన్సిపల్ ఎం.వినీత, డీన్ హరిబాబు, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని నర్సు ఆత్మహత్య

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్‌వారి వీధికి చెందిన నర్సు నిమ్మగడ్డ రోజా రాణి (40) తాను ఉంటున్న గదిలో ఉరివేసుకొని మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. కొత్తపేట సీఐ వీరయ్య కథనం మేరకు.. అబ్బరాజుపాలెంకి చెందిన రోజారాణి, ఆమె భర్త పదేళ్ల క్రితం విడిపోయారు. వారికి ఒక కుమార్తె ఉంది. ఆమెను అమరావతిలోని ఓ హాస్టల్‌లో చేర్పించింది. గణేష్‌వారి వీధిలో నివసిస్తున్న ఆమె, తన ఇంటికి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. రెండు రోజులుగా ఆమె సెల్ ఫోన్ పనిచేయడం లేదు. మంగళవారం ఆమె ఆసుపత్రికి వెళ్ళలేదు. ఈ క్రమంలో అనుమానం వచ్చిన ఇంటి యజమానులు ఆమె గది వద్దకు వెళ్లి చూడగా రోజారాణి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఆమెకు తల్లిదండ్రులు కూడా లేరు. రోజారాణి బంధువుల ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు దారి తీసిన కారణాలు తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన మిర్చి లోడు లారీ



మృతుడు రామకృష్ణ

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చుట్టుగుంట నుంచి పేరేచర్ల వెళ్లే రోడ్డులో మిర్చి యార్డు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంపత్‌నగర్‌కు చెందిన చెక్కా రామకృష్ణ (52) దుర్మరణం చెందారు. రామకృష్ణ మిర్చి యార్డులో కమిషన్ ఏజెంట్ వద్ద గుమ స్తాగా పని చేస్తున్నారు. రామకృష్ణ తన ద్విచక్ర వాహనంపై మిర్చి యార్డుకు వెళుతుండగా, అదే సమయంలో మిర్చిలోడు లారీ మహారాష్ట్ర వైపు వెళ్లేందుకు అదే మార్గంలో వెళ్తోంది. ద్విచక్ర వాహనంపై ఉన్న రామకృష్ణ డివైడర్ పక్కగా వెళ్తున్నాడు. ఆ లారీకి డివైడర్‌కు మధ్య ఖాళీ లేకపోవడం లారీ ముందు భాగం కుడివైపునకు రావడంతో దాని వెనుక టైరు కింద రామకృష్ణ పడినట్లు స్థానికులు తెలిపారు. రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సమాచారం మేరకు వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. రుద్ర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12న రాత్రి జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుజ్జనగుండ్ల సెంటర్ సమీపంలోని డాక్టర్ శేషయ్య ఆసుపత్రి పక్క వీధిలో జేకేసీ నగర్ 1వ లైనులో షేక్ గౌస్ (54) హత్య కేసులో నిందితుడు ఆకుల సాంబయ్యను అరెస్ట్ చేసినట్లు పట్టాభిపురం ఇన్‌చార్జ్ సీఐ వీరయ్య తెలిపారు. మృతుడు గౌస్ పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల అని, కొంత కాలంగా గుజ్జనగుండ్లలోని టెంట్ హౌస్ వద్ద మెట్లపై పడుకుంటూ ఉండేవాడని, గుజ్జనగుండ్లకు చెందిన సాంబయ్య కూడా అక్కడే పడుకుంటూ ఉండేవాడని చెప్పారు. ఈ నెల 12న రాత్రి మద్యం సేవిస్తున్న క్రమంలో వారి మధ్య గొడవ జరిగి సాంబయ్యను గౌస్ దుర్భాషలాడినట్లు తెలిపారు. మద్యం మత్తులో ఉన్న సాంబయ్య సిమెంట్ రాయితో గౌస్‌ను కొట్టడంతో చనిపోయాడని చెప్పారు.



మత్స్య విలాపం!

- కాలుష్య కోరలతో అంతరించిపోతున్న విశిష్ట మత్స్యజాతులు
- ఎగుమతుల్లోనూ వెనకడుగే
- వైసీపీ పాలనలో మత్స్యకారులపై నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంలో గంగపుత్రుల సంక్షేమం

నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం





సముద్రంలో ఉండే విశిష్ట మత్స్య సంపద కాలుష్యం దెబ్బకు అంతరించి పోయే ముప్పును ఎదర్కొంటోంది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలవడానికి తోడు పారిశ్రామిక వ్యర్థా లకు కూడా సముద్రమే అంతిమ మజిలీ కావడంతో ఎన్నోరకాల మత్స్యజాతులు అరుదైన జాతి కోవలోకి చేరిపోయాయి. ఈ క్రమంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పట్టించుకునే వారే కరువయ్యారు. గడచిన ఐదేళ్లలో ఈ విచ్చలవిడి తనం పతాకస్థాయికి చేరుకోవడంతో మొత్తం మత్స్య రంగమే ప్రమాదంలో పడే విలపించే స్థితికి చేరుకుంది. ఇక, మత్స్యకారుల గురించి చెప్పాలంటే సముద్రంలో చేపల వేటే వారి వృత్తి. నెలలో ఇరవై రోజులు గంగమ్మతోటే వారి ప్రయాణం. ఆటుపోట్లు, గంగమ్మ ఉరకలు, తుఫాన్ హెచ్చరికలు ఇవేవీ కడలితో వారికి ఉన్న బంధాన్ని తెంచలేవు. రెక్కలు ముక్కలయ్యేలా కష్టపడుతున్నా వారి జీవనప్రమాణాలు మాత్రం మెరుగుపడడం లేదు. గురువారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకారులతో పాటు ఆ రంగం ఎదుర్కొంటున్న అనేక ఆటుపోట్లపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చేపల వేటపై ఆధారపడి బతుకుతున్న వారు దాదాపు 50,000 మంది వరకు ఉంటారు. కానీ ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం ఈ సంఖ్య 20,000 ఉండటం గమనార్హం. ముఖ్యంగా చీరాల, చినగంజాం, రేపల్లె, బాపట్ల తీర ప్రాంతాల్లో మత్స్యకారులు ఎక్కువగా ఉంటారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క కార్యక్రమం కూడా మత్స్యకారుల కోసం చేపట్టక పోవడం గమనార్హం. ప్రతి ఏటా చేపల వేట నిలుపుదల చేసే రెండు నెలల కాలానికి మాత్రం అరకొరగా మత్స్యకార భరోసా పథకం కింద జమ చేసి 'మమ' అనిపించింది. జిల్లా వ్యాప్తంగా 'భరోసా'కు అర్హులైన వారే దాదాపు 25,000 మంది వరకు ఉండగా, 12,000 మంది ఖాతాల్లో మాత్రమే జమ చేసి గంగపుత్రులకు అన్యాయం చేసిన ఘనత వైసీపీది.

పురోగమింప చేయడానికి తీసుకోవాల్సినవి

చేపల పెంపకానికి అనువైన చెరువులను గుర్తించే ప్రక్రియ 2014-19 మధ్య ముమ్మరంగా జరి గింది. కానీ తర్వాత గద్దెనెక్కిన వారు పట్టించుకోవడమే మానేశారు. ప్రస్తుతం వాటిని గుర్తించ డంతో పాటు నీటి వనరులను కూడా కల్పించడం కూటమి ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యం. మత్స్యకార సొసైటీలను అన్ని విధాలుగా గత ప్రభుత్వం కుదేలు చేసింది. ఇప్పటికే సొసైటీలకు ఎన్నికలు జరిపే ప్రక్రియను కూటమి ప్రభుత్వం చేపట్టింది. సహకార సంఘాలకు పూర్వ వైభవం దక్కే విధంగా ప్రభుత్వం వైపు నుంచి చేయూత అందించి నిలదొక్కుకునే అవకాశం కల్పించడం ప్రాధాన్యంగా చేయాల్సి ఉంది.

ఎగుమతులపై దృష్టి పెట్టాలి

గడచిన ఐదేళ్లలో ఎగుమతులలో జిల్లా వాటా పడిపోతూ వస్తోంది. 86 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం ఉన్న జిల్లాలో దాదాపు 3,000 వరకు వేట పడవలు ఉన్నాయి. ఏటా 850 టన్నుల వరకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఇక్కడ నుంచి ఎగుమతి చేసేవారు. కానీ గడచిన ఐదేళ్లలో అవలంబించిన అస్తవ్యస్త విధానాలతో ఇది కాస్తా 600 టన్నులకు పరిమితమైనట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. సముద్రంలో చేపల సంఖ్య భారీగా తగ్గడంతో గిట్టుబాటు కావడం లేదని మత్స్యకారులు వాపోతున్న ఉదంతాలు కోకొల్లలు. ప్రస్తుతం కేంద్రం నుంచి కూడా సహకారం అందుతుండడం వల్ల వీలైనన్ని చేపల అనుబంధ ప్రాజెక్టులను జిల్లాకు తీసుకురావడంలో ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

'హామీ' నిలబెట్టుకుని భరోసా పెంచాలి

ఎస్. అనిల్ కుమార్, జిల్లా ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీస్ వైస్ చైర్మన్



వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ. 20,000 కు పెంచుతామని ఎన్నికలకు ముందు చెప్పినట్లుగానే అమలు చేయాలి. గత ప్రభుత్వంలో అర్హులైన చాలా మంది మత్స్యకారులకు 'భరోసా' విషయంలో న్యాయం జరగలేదు. ఇప్పుడు అందరికీ పరిహారం అందేటట్లు చూడాలి. సొసైటీలను బలోపేతం చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలి.

వ్యర్థాలు సముద్రంలో కలవకుండా చూడాలి

సముద్రతీర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు వాటి వ్యర్థాలను సముద్రంలో కలపడం ద్వారా పెద్ద ఎత్తున మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతోంది. మత్స్య సంపదకే కేంద్రంగా ఉండే నదులు, వాగులు, చెరువులను కాలుష్యం ఓ వైపు కమ్మేస్తుంటే, మరో వైపు ఆక్రమణలు శాపంగా మారాయి. నాలుగేళ్ల కిందట కేంద్రం ప్రారంభిం చిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన జిల్లాలో అమలైన దాఖలాలే కనిపించలేదు. ఈ పథకం కింద మత్స్యసంపదను పెంచేవిధంగా కార్యాచరణ రూపొందిం చడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ముం దుకెళ్లడం దీనిలోని ప్రధాన అంశం. కానీ ఆ దిశగా రాష్ట్రం చొరవ తీసుకోకపోవడంతో ఆ నిధులు కూడా నిరుపయోగమైనట్లు సమాచారం.

వాతావరణ మార్పులతో ఒడిదుడుకులు

ఇక వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులు కూడా మత్స్యరంగం ఒడిదుడుకులకు కారణంగా ఉంది. కొవిడ్ తర్వాత ఎగుమతులపై ఆంక్షలు పెరగడంతో పాటు నాణ్యత విషయం లోనూ కఠినమైన ఆంక్షలను అంతర్జాతీయంగా ఎదుర్కోవాల్సి రావడం కూడా ఈ రంగానికి గొడ్డలి పెట్టులా తయారైంది. మత్స్యకారుల సంక్షేమమే తొలి ప్రాధాన్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయాల్సి ఉంది. కడలిని వ్యర్థాలకు ఆవాసాలుగా మారకుండా చూసి మత్స్య సంపదను కాపాడాల్సిన గురుతర బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఐదేళ్ల బాలారిష్టాలకు స్వస్తి చెబుతూ భవిష్యత్తులో మత్స్యరంగాన్ని పురోగమన బాట పట్టించే విధంగా ప్రపంచ మత్స్య దినోత్సవం రోజు పాలకులు ప్రతినబూని అందుకు తగ్గ కార్యాచరణ రూపొందిం చాల్సిన అవసరం ఉంది.

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. ఇదికూడా జరుగుతోంది. ఆ జాబితా పరిశాలన కూడా ఏకకాలంలోనే జరుగుతోంది. ఇది కాక ప్రతి సంవత్సరం కొత్త ఓట్ల చేరికలకు సంబంధించి 2025 జనవరి 5 నాటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పూర్తిచేసేలా స్పెషల్ సమ్మరీ రివిజన్ కూడా జరుగుతోంది. వీటన్నిటికీ వీఆర్‌ఓలు బీఎల్‌ఓ హోదాలో హాజరు కావలసిందే. ఎన్నికల విధుల్లో బీఎల్‌ఓలుగా ఆయా గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో వీఆర్‌ఓలనే నియమిస్తారు. వారు చాలకుంటే ఇతర శాఖల సిబ్బందిని కూడా బీఎల్‌ఓలుగా తీసుకునే అధికారం ఉండటంతో ఇతర సిబ్బందినికూడా దీనికి ఉపయోగిస్తున్నారు. ఇదిట్లా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం హౌస్‌హోల్డ్ సర్వే చేపట్టింది. దీనికి ఇప్పటికే సచివాలయ సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. అయితే సర్వే వేగవంతం కావటంలేదనే వత్తిడి కూడా ప్రభుత్వం నుంచి వస్తుండటంతో చాలా మండలాల్లో ఎంపీడీఓలు సచివాలయ సిబ్బందినే కాకుండా వీఆర్‌ఓలను కూడా సర్వే విధులకు పంపుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ సమన్వయంతో ఉన్న మండలాల్లో వీరి సమస్య పెద్దగా లేకు న్నా, కొన్నిమండలాల్లో మాత్రం అగ్గి రాజుకుంటోంది.

అడకత్తెరలో.. వీఆర్వోలు

వైసీపీ సర్కారు పెట్టిన చిచ్చుతో...

గతంలో రెవెన్యూ శాఖ కింద పనిచేసే సిబ్బంది మొత్తానికి వేతనాలు సిద్ధంచేసి పంపే అధికారం ఆయా మండలాల తహసీల్దార్‌లకే ఉండేది. అయితే వైసీపీ సర్కారు వచ్చాక దీనిలో తీవ్ర గందరగోళ పరిస్థితిని తీసుకొచ్చింది. వీఆర్‌ఓల వేతనాలు వేసే అధికారం ఎంపీడీఓలకు అప్పగించారు. అయితే ఇక్కడా మరో మెలిక ఉంది. వీఆర్‌ఓలలో గ్రేడ్-1, గ్రేడ్-2 అనే రెండు కేటగిరీలు చేశారు. పాత కాలం నుంచి ఉన్న వీఆర్‌ఓలను గ్రేడ్-1 కింద ఉంచి, వారికి జీతం తహసీల్దార్ పరిధిలోనే ఇచ్చేలా పాత పద్ధతినే ఉంచేస్తే, వీఆర్‌ఏలు, ఇతర శాఖల నుంచి ప్రమోషన్‌పై వచ్చిన వీఆర్‌ఓలను గ్రేడ్-2 కింద కేటాయించారు. వీరికి మాత్రం తహసీల్దార్ కాకుండా ఎంపీడీఓలు వేతనాలు వెయ్యాల్సి ఉంటుంది. అటు సచివాలయంలోనూ విలేజ్ రెవెన్యూ సెక్రటరీలు, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరికీ ఎంపీడీఓలే వేతన బిల్లులు పంపాల్సి ఉంటుంది. గ్రేడ్-2 కింద ఉన్నవారు కూడా రెవెన్యూ కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తిస్తుంటారు. అయితే తాజాగా పెరిగిన పని వత్తిడి కారణంగా ఎవరికివారు మా సిబ్బందంటే మా సిబ్బందంటూ వారికి విధులు అప్పగించేస్తున్నారు. అయితే రెండు చోట్ల విధులకు హాజరు కాలేక సతమతమవటం వీఆర్‌ఓల వంతవుతోంది. ఈ తరహా అనాలోచిత మార్పులు చేసిన వైసీపీ సర్కారు నిర్ణయాల కారణంగా ఇప్పుడు శాఖల మధ్యే సమన్వయం లోపించటానికి, వారి మధ్య వివాదాలకు కారణమవుతోంది. తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని, పెదనందిపాడు, అటు బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మరికొన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఈ వ్యవహారం తారాస్థాయికి చేరితే, మరికొన్నిచోట్ల సర్దుకుపోతూ, పని వత్తిడి వచ్చినప్పుడు బయటపడుతూ వస్తున్నారు. తెనాలి, మరికొన్నిచోట్ల వీఆర్‌ఓలపై తహసీల్దార్‌లు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా పరిశీలనా విధులకు రావాలని తెగేసి చెబుతుంటే, ఎంపీడీఓలు తాము చెప్పిన విధులకు రాకుంటే మెమోలే జారీ చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని వీఆర్‌ఓలు ఆరోపిస్తున్నారు. తెనాలిలో ఇప్పటికే ముగ్గురికి మెమోలు ఇస్తే, ఒకరి వేతనం ఆపుతామని బెదిరించారని, నెలనెలా వచ్చే జీతంతో బతికేవారిపై ఇటువంటి బెదిరింపులకు దిగితే ఎట్లాగంటూ వారూ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వీఆర్‌ఓల సంఘంలో ఈ వివాదాన్ని పెట్టి తేల్చుకుంటామంటూ వారూ తగ్గకుండా హెచ్చరికలు చేయటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ఇదిట్లాఉంటే గుంటూరు జిల్లాలోని కొన్ని మండలాల వీఆర్‌ఓలు మాత్రం ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళితే, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కలెక్టర్‌కు విన్నవించుకుని, ఫలితం కనిపించకపోతే, ప్రత్యక్ష ఆందోళనకు దిగాలనే ఆలోచనలోనూ ఉన్నట్టు సమాచారం. ఇదిట్లాఉంటే... కొందరు తహసీల్దార్‌లు ఏకంగా సీఎం దగ్గరకు ఈ గందరగోళాన్ని తీసుకెళ్లి సరిదిద్దాలని కోరే ఆలోచనలో ఉంటే, మరోపక్క ఎంపీడీఓలు కూడా రాష్ట్ర మంత్రి లోకేష్ దగ్గరకు వెళ్లి వైసీపీ ప్రభుత్వ కాలంలో చేసిన మార్పులవల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.

పొన్నెకల్లు జడ్పీస్కూల్ పీఈటీ సస్పెన్షన్

- పాఠశాల హెచ్‌ఎంకు చార్జిమెమో జారీ

గుంటూరు(విద్య),నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాడికొండ మండలం పొన్నెకల్లులోని డీవీకేఆర్ జడ్పీ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి షేక్ సమీర్ మరణించిన సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల పీఈటీ పై రాజారెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈవో సీవీ రేణుక బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల డ్రిల్ సమయంలో 9మంది విద్యార్థులు గోడదూకి బయటకు వెళ్లారు. వారు మరో విద్యార్థి సమీర్‌తో కలిసి ఈతకు వెళ్ళారు. సంఘటనలో సమీర్ బావిలో పడి మరణించిన విషయం తెలిసిందే. దీనికి పీఈటీ నిర్లక్ష్యమే కారణమని డిప్యూటీ డీఈవో ఇచ్చిన నివేదికతో పీఈటీ రాజారెడ్డిని విధులు నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు. అదేవిధంగా పాఠశాల హెచ్‌ఎం జరీనా ముంతాజ్‌బేగంపై చార్జీమెమోను ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి జారీ చేశారు. హెచ్‌ఎం నుంచి వచ్చే సమాధానం ఆధారంగా విచారణ జరిపి ఆమెపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆర్‌జేడీ స్పష్టం చేశారు.

రౌడీషీటర్ బోరుగడ్డ బెయిల్ పిటిషన్లు డిస్మిస్

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌పై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు కేసుల్లో వేసిన బెయిల్ పిటిషన్లు డిస్మిసయ్యాయి. బెయిల్ కోసం బోరుగడ్డ తరఫున దాఖలైన రెండు పిటిషన్లపై విచారించిన ఐదో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ లత వాటిని డిస్మిస్ చేస్తూ బుధవారం ఆదేశాలిచ్చారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డపై రాష్ట్రవ్యాప్తంగా అనేక కేసులు నమోదు కాగా పోలీసులు పిటి వారెంట్లపై ఆయా కోర్టులలో హాజరు పరుస్తున్నారు.

వెనుతిరిగిన పట్టాభిపురం పోలీసులు

రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పిటి వారెంట్‌పై మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచేందుకు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి వెళ్ళిన పట్టాభిపురం పోలీసులకు నిరాశే ఎదురైంది. అనంతపురం జిల్లాలో నమోదైన ఓ కేసులో అక్కడి పోలీసులు పిటి వారంట్‌పై కేంద్ర కారాగారంలోనే కస్టడీలోకి తీసుకుని జూమ్ యాప్ ద్వారా వర్చువల్‌గా సంబంధిత మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచగా 14 రోజులు రిమాండ్ విధించారు. అయితే పట్టాభిపురం పోలీసుల వారెంట్ గడువు బుధవారంతో ముగియడంతో వారు వెనుతిరిగారు.

దౌర్జన్యం కేసులో ముగ్గురి పేర్లు వెల్లడి

ముగిసిన తుళ్లూరు పోలీసుల విచారణ

గత అనుభవాల దృష్ట్యా ఈ దఫా తుళ్లూరు పోలీసులు రౌడీషీటర్ బోరుగడ్డ విషయంలో కాస్తంత కటువుగానే వ్యవహరించారు. బోరుగడ్డను రెండు కేసుల్లో రెండు రోజులు పాటు కస్టడికి అనుమతిస్తూ మంగళగిరి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాజమహేంద్రవరం నుంచి తుళ్లూరు తీసుకువచ్చి తిరిగి కోర్టులో హాజరు పరచడానికే సమయం సరిపోతుందని, విచారణకు సమయం చాలదని పోలీసులు కోర్టును అభ్యర్థించడంతో కస్టడి సమయాన్ని పొడిగించారు. దీంతో తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బోరుగడ్డను రెండు రోజుల పాటు విచారించారు. విచారణ సమయంలో ఆయనను లాకప్‌లోనే ఉంచారు. చివరకు మధ్యాహ్న భోజనం కూడా లాకప్‌లోకే అందించారు. కూర్చునేందుకు ఇనుప కుర్చీ ఇవ్వడంతో పాటు సాధారణ ఖైదీలు వెళ్లే బాత్రూం వినియోగించేలా చూశారు. ఈ ఏడాది మే 8న ఎన్నికల సందర్భంగా తుళ్లూరుకు రెండు కార్లలో వెళ్లి అక్కడ ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిపై దౌర్జన్యం, దానిని చిత్రీకరిస్తున్న ఏబీఎన్ విలేకరిపై దాడితో పాటు దాబా హోటల్‌లోని సిబ్బందిని కత్తులతో బెదిరించి దౌర్జన్యం చేసిన ఘటనలపై బోరుగడ్డపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనలో బోరుగడ్డతోపాటు మరో నలుగురు వరకు పాల్గొన్నట్లు అప్పట్లో పోలీసులు గుర్తించారు. అయితే వారు ఎవరనేది తాజా విచారణలో బోరుగడ్డ నుంచి ముగ్గురి వివరాలు రాబట్ట గలిగారు. తన కారు డ్రైవర్ లాం గిరి, బంధువు సమర్పన్, రాజారావు తనతో పాటు పాల్గొన్నట్లు బోరుగడ్డ పోలీసులకు చెప్పాడు. బోరుగడ్డ చెప్పిన ముగ్గుర్ని అరెస్టు చేయాల్సి ఉంది. తనకు సయాటికా ఉందని విచారణకు అవకాశం ఇవ్వరాదని బోరుగడ్డ మేజిస్ట్రేట్‌కు సూచించగా అసలు సయాటికా ఎక్కడ వస్తుంది అని మేజిస్ట్రేట్ ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేకపోయాడు. దీంతో విచారణ సందర్భంగా పోలీసులకు, కోర్టులకు సహకరించాలని మెజిస్ట్రేట్ ఆదేశించడంతో అలాగేనంటూ తల ఊపుతూ బోరుగడ్డ వెనుతిగాడు. అయితే బోరుగడ్డ రెండు రోజుల విచారణలో పోలీసులకు సహకరించలేదని తెలిసింది. మొదటి రోజు చెప్పిన సమాధానాలకు రెండో రోజు చెప్పిన సమాధానాలకు పొంతన లేదని సమాచారం.

ముసాయిదా ముద్రణకు సిద్ధం

- పట్టభద్రుల దరఖాస్తులు దాదాపు పరిష్కారం
- బుధవారం సాయంత్రానికి 5 శాతమే పెండింగ్
- ఓటు కోసం 3 లక్షల 32 వేల 783 మంది దరఖాస్తు
- 23న డ్రాఫ్టు లిస్టు విడుదల చేస్తామన్న ఈఆర్‌వో కాజావలి

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నిక కోసం జరుగుతోన్న ఓటరు నమోదు ప్రక్రియ ముసాయిదా జాబితాల ప్రచురణ దశకు చేరుకున్నది. నోటిఫికేషన్ ప్రకారం ఆమోదించిన దరఖాస్తుదారుల పేర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణకు చర్యలు చేపట్టారు. బుధవారం అర్థరాత్రి వరకు దరఖాస్తుల పరిష్కారానికి సమయం ఉండటంతో పెండింగ్‌లో ఉన్న 5 శాతం కూడా క్లియర్ చేసి డ్రాఫ్టు ఓటరు లిస్టుని ప్రిం టింగ్‌కు పంపుతామని ఈఆర్‌వో ఎస్ఎస్‌కే కాజావలి తెలిపారు. ఈసీ ఆమోదంతో ఈ నెల 23న తుది ఓటర్ల జాబితాని ప్రచు రించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు హార్డ్/సాఫ్టు కాపీలను అందజేస్తామన్నారు. పట్టభద్రులు ఈ దఫా ఓటరు నమోదులో ఎక్కువగా ఆన్‌లైన్ సర్వీసులను వినియోగిం చుకున్నారు. ఈసీఐ వెబ్‌సైట్ ద్వారా ఫారం-18లను పంపించారు. బాపట్ల జిల్లాలో 21519, ఏలూరులో 14709, గుంటూరులో 91013, కృష్ణాలో 48040, ఎన్‌టీఆర్‌లో 58154, పల్నాడులో 50300 మంది కలిపి మొత్తం 2 లక్షల 83 వేల 735 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అలానే ఆఫ్‌లైన్‌లో ఈ ఆరు జిల్లాల నుంచి 49048 మంది దరఖాస్తులు పెట్టారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కలిపి మొత్తం 3 లక్షల 32 వేల 783 మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేశారని ఎన్నికల అధికారులు తెలిపారు.

దరఖాస్తుల పరిష్కారం ఇలా..

ఓటరు దరఖాస్తులను మూడు దశల్లో పరిష్కరించారు. తొలుత బీఎల్‌వోల ద్వారా కార్యశాలలో దరఖాస్తులను పరిశీలింపచేశారు. ఆ తర్వాత వాటిని ఏఈఆర్‌వోలు పరిశీలించి ఆమోదించారు. వాటిని ఆఖరుగా ఈఆర్‌వో పరిశీలించి ఆమోదం తెలిపారు. అర్హతలు సరిగా జత చేయని దరఖాస్తులను తిరస్కరించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో 2 లక్షల 35 వేల 295 ఆమోదించారు. 32,093 తిరస్కరించారు. ఇంకా ఏఈఆర్‌వో లాగిన్‌లో 11,758, ఈఆర్‌వో వద్ద 4589 పెండింగ్‌లో ఉన్నాయి. ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో 47742 ఆమోదించారు. 980 తిరస్కరించారు. 326 పెండింగ్‌లో ఉన్నాయి.


గుంటూరులోనే ఎక్కువ దరఖాస్తుల పెండింగ్

బుధవారం సాయంత్రానికి పెండింగ్ ఉన్న 5.01 శాతం దరఖాస్తుల్లో ఎక్కువ సంఖ్యలో గుంటూరు జిల్లాలోనివే ఉన్నాయి. మొత్తం 16673 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వాటిల్లో 11249 గుంటూరు జిల్లాలోనివే. గుంటూరు నగరంలోనివి ఎక్కువగా ఉన్నాయి. బాపట్లలో 751, ఏలూరులో 354, కృష్ణలో 277, ఎన్‌టీలో 1443, పల్నాడులో 2599 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఇవన్నీ అర్ధరాత్రి లోపు క్లియర్ చేసి ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణ కోసం పంపుతామని ఈఆర్‌వో కాజావలి తెలిపారు.

డిసెంబరు 9వ తేదీ వరకు ఓటుహక్కుకు అవకాశం

- ఈఆర్‌వో ఎస్ఎస్‌కే కాజావలి

కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికలో ఓటుహక్కు పొందేందుకు డిసెంబరు 9వ తేదీ వరకు అవకాశం ఉందని ఈఆర్‌వో ఎస్ఎస్‌కే కాజావలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముసా యిదా ఓటర్ల జాబితా ఈ నెల 23వ తేదీన ప్రచురిం చడం జరుగుతుందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబి తాపై అభ్యంతరాలను అదే రోజు నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుం దన్నారు. అర్హత ఉండి ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేకుంటే వారు కూడా డిసెంబరు 9లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కొత్త దరఖాస్తులు కూడా స్వీకరిస్తామ న్నారు. అభ్యంతరాలను డిసెంబరు 25న పరిష్కరించి 30న తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తామని చెప్పారు.



వివా, వీవీఐటీలో శ్రీశృంగేరీ పీఠాధిపతి

విద్యార్థులకు విధుశేఖరభారతీస్వామి ఆశీర్వచనాలు



స్వామీజీ వద్ద ఆశీర్వాదం పొందుతున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ దంపతులు

పెదకాకాని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయ యాత్రా మహో త్సవంలో భాగంగా గుంటూరు పర్యటనకు విచ్చేసిన శృంగేరి శారదా పీఠం జగద్గురువు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ మహాస్వామి బుధవారం వీవీఐటీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మహాస్వామి విద్యార్థులకు, అధ్యాపకులకు ఆశీర్వచనాలను అందజేశారు. తొలుత కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణప్రియ దంపతులు స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు అనుగ్రహభాషణం చేశారు. విద్యార్థులను కేవలం పిల్లలు అని మా త్రమే అనుకూడదని వారు దేశం యొక్క అపారమైన భవిష్యత్ అన్నా రు. ధృడమైన లక్ష్యం ఎంచుకుని వాటిని సాధించేలా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. గొప్పవాళ్లం కవాలనుకుంటే సరిపోదని దానికి తీవ్రమైన కోరిక, కృషి కలిగి ఉండాలని ఉపదేశించారు. దేశం, ధర్మం రెండూ రెండు కళ్ళవంటివని వాటిని పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరి బదరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని యానిమేటర్ల నిరసన

గుంటూరు(తూర్పు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యానిమేటర్లుకు రావాల్సిన ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, మూడు సంవత్సరాల కాలపరి మితి జీవోను రద్దు చేయాలని యానిమే టర్స్ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. జిల్లా డీఆర్డీఏ కార్యాలయం ఎదుట బుధవారం యానిమేటర్లు నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాని మేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మూడు సంవత్సరాలకే యానిమే టర్లు ఉద్యోగం వదిలి వెళ్లాలనడం సరైనది కాదన్నారు. యాని మేటర్లకు సెల్‌ఫోన్లు, 5జీ నెట్‌వర్క్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కే పద్మ, విజయలక్ష్మి. శారద పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- మృత్యుతో పోరాడుతున్న భర్త

పెదకాకాని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త మృత్యువుతో పోరాడుతున్న సంఘటన బుధవారం పెదకాకానిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదకాకాని సదాశివ నగర్‌లో పావని, కృష్ణ దంపతులు నివాసం ఉంటున్నారు. కృష్ణ అన్ని ఫంక్షన్లకు ఈవెంట్ మేనేజ్మెంట్ చేస్తుంటాడు. భార్య పావని(వయస్సు 26సం) మంచి సింగర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. దీంతో వీరిద్దరూ కలిసి ఈవెంట్ ఆర్గనైజేషన్ చేస్తుంటారు. వ్యక్తిగత పనులపై విజయవాడ వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఇంటి వద్ద నుంచి పెదకాకాని మెయిన్ సెంట ర్‌కు వస్తుండగా, సెంటర్ సమీపంలోని గౌడ పాలెం కార్నర్ వద్ద ఓ ప్రైవేటు స్కూలు బస్సు బ్రేక్ ఫెయిల్ అయ్యి అతివేగంగా వచ్చి వీరి వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో పావని అక్కడికక్కడే మృతి చెంద గా, ఆమె భర్త కృష్ణ తీవ్రగాయాలతో మృత్యు వుతో పోరాడుతున్నాడు. కాకాని రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పావని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు మార్చురీకి తరలించారు.

వైద్య మిత్రల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ దళిత, గిరిజన వైద్య మిత్ర అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు మాచర్ల బుజ్జి ఒక ప్రకటనలో కోరారు. శాసనమండలిలో వైద్య మిత్రల సమస్యలపై చర్చించిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య మిత్రలకు కనీస వేతనం రూ.28 వేలు ఇవ్వాలని, ఉద్యోగులను కేటగిరీ-1లో చేర్చాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. వైద్య మిత్రల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

రహదారులకు మరమ్మతులు



ఇప్పటంలో రోడ్ల గుంతలు పూడుస్తున్న దృశ్యం

తాడేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో రహదారుల గుంతలు పూడ్చివేసే ప్రక్రియ బుధవారం నిర్వహించారు. గ్రామంలో ఆయా ప్రాంతాలకు వెళ్లే మార్గంలో రహదారులు గుంతలతో అధ్వానంగా మారడంతో లోకేశ్ చొరవతో అధికార గణం గుంతలు పూడ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గ్రామస్థులు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన చెస్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

తాడికొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల చెస్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ పురుషుల విభాగం నుంచి 4 టీంలు, మహిళల విభాగం నుంచి 4 టీంలు గెలుపొందినట్లు చెప్పారు. పోటీల్లో పురుషుల విభాగం నుంచి ఆర్‌వీఆర్ కళాశాలకు మొదటి బహుమతి, బాపట్ల కళాశాలకు రెండో బహుమతి, చలపతి ఇంజనీరింగ్ కళాశాలకు మూడో బహుమతి, చలపతి ఫార్మసీ కళాశాలకు నాలుగో బహుమతి వచ్చినట్లు తెలిపారు. మహిళల విభాగంలో చలపతి ఫార్మసీ కళాశాలకు మొదటి బహుమతి, బాపట్లకు రెండో, ఆర్.వీ.ఆర్. అండ్ జేసీ కళాశాలకు మూడో, జేకేసీ కళాశాల నాలుగో బహుమతిని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు సీహెచ్ వెంకట్రావు, ఆదిబాబు, అరుణ సుజాత సెలక్షన్ కమిటీగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్స్ ఏవీ రాఘవయ్య, భానుప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇస్త్రీబండి అందజేత



వడ్డేశ్వరంలో ఇస్త్రీబండి అందజేస్తున్న కాట్రగడ్డ మధు

తాడేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామం రాధారంగా నగర్‌కు చెందిన గుంపుల రంగమ్మకు మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో టీడీపీ సీనియర్ నాయకుడు కాట్రగడ్డ మధుసూదనరావు తన సొంత నిధుల నుంచి ఇస్త్రీ బండిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత మధుకు రంగమ్మ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, జోరుగ దాసు, వడ్డేశ్వరం అబ్రహం, షేక్ ఇమాంసా, కామినేని మౌనిక, కంచర్ల కోటేశ్వరరావు, కాట్రగడ్డ లక్ష్మి, కాట్రగడ్డ రాధ, రాజు, ప్రభుకుమార్, నాగూర్‌వలి, కావలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

తుళ్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తుళ్లూరులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతుంది. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మూడో రోజు బుధవారం 750 మంది సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న టీడీపీకి జనంలో విపరీతమైన ఆదరణ పెరగటంతో సభ్యత్వం కోరుకుంటున్నారని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు, తాడికొండ నియోజకవర్గ టీడీపీ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు, నాయకులు ఉప్పలపాటి సాంబశివరావు, బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్, జొన్నలగడ్డ కిరణ్, జె.హరికిరణ(బాబి), నరేంద్ర, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల విక్రయాలకు రశీదులు ఇవ్వాలి : ఏడీఏ

కాకుమాను, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : రైతులు కొనుగోలు చేసిన ప్రతి పురుగు మందులు, ఎరువుల కొనుగోళ్లకు సంబంధించిన రశీదులు దుకాణ యజమానులు ఇవ్వాల్సిందేనని మంగళగిరి ఏడీఏ శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కాకుమానులో లక్ష్మీ ప్రసాద్ ఫర్టిలైజర్స్, వినాయక ఫర్టిలైజర్స్, మహాలక్ష్మీ ఫర్టిలైజర్స్‌లతో పాటు పలు పురుగుమందుల దుకాణాలను, అలాగే బాపట్ల రహదారిలో ఉన్న మన గ్రోమోర్ కేంద్రాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు.

భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం

కాకుమాను, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాకుమానులో ఉన్న శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయంలో మంగళవారం రాత్రి కోటి దీపోత్సవం కన్నులపండుగలా జరిగింది. ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మందిరంలో అమ్మవారి ఉత్సవమూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించి అమ్మవారికి కుంకుమ పూజ చేశారు.

అంగన్‌వాడీ చిన్నారులకు అర్థమయ్యేలా బోధన చేయాలి

● రోడ్ల నిర్మాణంలో నాణ్యత ముఖ్యం : కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి



కోవెలమూడిలో అంగన్‌వాడీ చిన్నారులతో కలెక్టర్ నాగలక్ష్మి

వట్టిచెరుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోవెలమూడి, ముట్లూరు, అనంతవరప్పాడు గ్రామాల్లో అంగన్‌వాడీ, సీసీ రోడ్ల నిర్మాణం, పశువుల పాక నిర్మాణాలను బుధవారం కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత మండలంలోని కోవెలమూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థుల హాజరు, శిక్షణా వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రిజిస్టర్‌ను పరిశీలించటంతో పాటు వంట గది పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ నాగలక్ష్మి స్వయంగా చిన్నారులకు ఆట వస్తువులను బొమ్మరూపంలో పంపిణీ చేసి ఆంగ్లంలో పలకాలని పిల్లలకు సూచించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నిత్యం చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని టీచర్ సునీతకు సూచించారు. అలాగే గ్రామ సమీపంలో మొక్కలను ఆమె పరిశీలించారు. అనంతరం ముట్లూరులో ప్రభుత్వం మంజూరు చేసి నిర్మాణంలో ఉన్న పశువుల పాక నిర్మాణాన్ని ఆమె పరిశీలించి లబ్ధిదారుడు పీ సుధాకర్‌తో మాట్లాడారు. అనంతవరప్పాడు గ్రామంలో పల్లె పండుగలో మంజూరైన డ్రెయిన్‌లు, సీసీ రోడ్ల నిర్మాణాన్ని కలెక్టర్ అధికారులతో తనిఖీ చేశారు. అనంతరం స్థానిక జడ్పీ హైస్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల రిజిస్టర్‌ను పరిశీలిస్తూ గత సంవత్సరం 372 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 302 మంది మాత్రమే చేరటాన్ని హెచ్ఎం అరుణకుమారిని ప్రశ్నించారు. అలాగే మధ్యాహ్న భోజన వంటశాలను క్షుణ్ణంగా పరిశీలించి భోజనాన్ని రుచి చూశారు. అలాగే హైస్కూల్లో విద్యార్థుల కోసం ప్రారంభమైన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆర్డీవో కే శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీలు విజయలక్ష్మి, శంకర్, డీఈవో రేణుక, ఎంపీ డీవో రమేష్ బాబు, డీటీ దరియావలి, ఆయా గ్రామాల సెక్రటరీలు, అడిషనల్ సీడీపీవో నిర్మల, అనంతవరం గ్రామ సర్పంచ్ దారా వెంకటరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన పెంచుకోవాలి



నవులూరు జడ్పీ పాఠశాలలో వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని

మంగళగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్ కోరారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవులూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మత్తు వదిలితేనే భవిష్యత్తు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ బాలల పరిరక్షణను దృష్టిలో వుంచుకుని ఐక్యరాజ్య సమితి 1989లో బాలల హక్కులపై చట్టబద్ధమైన అంతర్జాతీయ ఒప్పందం తీసుకువచ్చిందని తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు కే సుష్మా, ఎన్ కుమార్‌రాజా, నవజీవన్ బాల భవన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

● తుళ్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల దినోత్సవం తుళ్లూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గుడ్‌షెఫర్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సిస్టర్ వసుంధర నిర్వహించారు. సహాయక కార్మిక అధికారి ఏవీఎల్ సుకన్య మాట్లాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన బాల్యంలో హోటల్స్, ఫాక్టరీ, బేకరి, ఇటుకల తయారీ బట్టీలలో బండ చాకిరికి బలైపోతున్నారని అన్నారు. ఎస్ఐ అంకమ్మ మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలు ప్రమాదకర వృత్తులు చేయటం నిషిద్ధమన్నారు. కార్యక్రమంలో మందడం అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ సీతారావమ్మ, గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్టాఫ్, మండల క్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి సుబ్బరామాయన్



గ్రామస్థులకు సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

పెదనందిపాడు, నవంబరు, 20 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి సుబ్బరామాయన్ అన్నారు. మండల పరిధిలోని వరగానికి చెందిన బి.విజయరాజు చీమకుర్తిలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో పని చేస్తూ అనారోగ్యానికి గురై గుంటూరు జీజీహెచ్‌లో చేరి చికిత్స చేయించుకుంటుండగా మలేరియా పాజిటివ్ అని నిర్ధారణ కావడంతో బుధవారం అధికారులు గ్రామంలో పర్యటించి అతని నివాసాన్ని, బంధువులను విచారించి రక్తనమూనాలు తీసుకున్నారు. ప్రజలకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. గ్రామాల్లో విష జ్వరాలు విజృంభించే ప్రమాదం ఉందని, దీనిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీ వారి సహకారంతో మురుగు కాల్వల్లో నీరు పారుదలకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి ప్రశాంత్‌కుమార్, సూపర్‌వైజర్ , సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి

మేడికొండూరు నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్య రహిత సమాజ స్థాపనకు యువత సహకారం అవసరమని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవికుమార్‌రెడ్డి అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖా నెహ్రూ యువకేంద్ర గుంటూరు సౌజన్యంతో పేస్ సొసైటీ ఆధ్వర్యంలో పేరేచర్ల సమీపంలోని యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన డ్రగ్ ప్రివెన్షన్‌పై కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి కరస్పాండెంట్ ఫాదర్ పామిశెట్టి బాలస్వామి అధ్యక్షత వహించారు. రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ వి.అరుణ కుమారి మాట్లాడుతూ యువత దైనందిన జీవితంలో డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని అన్నారు. డిపార్టుమెంట్ తరపున పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రదర్శించి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ యశోదరరాణి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌లు మూర్తి, మాధవి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి, పేస్ సొసైటీ కార్యదర్శి పారుపల్లి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్ రమేష్, యూనివర్సల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామస్థుల ఆందోళన

దుగ్గిరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపాలెం వాసులు గ్రామశివారులోని అడ్డరోడ్డు వద్ద మద్యం దుకాణం ఏర్పాట్లను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. చినపాలెం అడ్డరోడ్డు వద్ద బస్‌షెల్టర్ వెనుక మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న స్థలం వద్దకు బుధవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన మహిళలు, కొందరు రైతులు చేరుకున్నారు. రెండు గ్రామాల నుంచి పెదపాలెం హైస్కూల్ వెళ్లి వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు ఇదే మార్గం గుండా తమ పిల్లలు వెళ్లాలని, మహిళా కూలీలు ఇదేమార్గం గుండా వెళుతుంటారని, గతంలో మహిళల మెడలో గొలుసులు సైతం లాక్కెళ్లిన ఘటనలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చినపాలెంలో మద్యం దుకాణం ఏర్పాటు యోచనను విరమించుకోవాలని హెచ్చరించారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

మంగళగిరి సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేమూరు మండలం దోనెపూడి గ్రామానికి చెందిన అరుమళ్ల హర్ష అనే అయిదేళ్ల బాలుడు కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ గుంటూరు బ్లాసమ్స్ మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న మంగళగిరి విజయ హెల్త్ కేర్ ట్రస్టు ప్రతినిధులు స్పందించి బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకురాలు కాగితాల స్వాతి గౌడ్, డాక్టర్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ 17 త్రోబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టీడీపీ నేతలు రాజశేఖర్‌రెడ్డి, కొల్లి శేషు

తాడేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహంతో తాడేపల్లి మండలం పెనుమాక జడ్పీ హైస్కూల్‌లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 బాలబాలికల ఉమ్మడి గుంటూరు జిల్లా త్రోబాల్ పోటీలను తెలుగురైతు గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ముఖ్యమన్నారు. మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, తెనాలి కోటేశ్వరరావు, తమ్మా శివరాజేశ్వరి, హెచ్ఎం వి.పూర్ణచంద్రరావు, పఠాన్ జానీ ఖాన్, కళ్లం శివగోవిందరెడ్డి, పీఈటీ రమేష్, స్కూల్ టీచర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

● మండల వ్యవసాయ అధికారి లక్ష్మి

వట్టిచెరుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు చేరువగా రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ పర్యవేక్షణలో ప్రతి గ్రామంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కే.లక్ష్మి తెలిపారు. వట్టిచెరుకూరులోని రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోళ్ళు, మద్దతు ధర, వరి ధాన్యం శాతం తదితర వివరాలతో కూడిన బ్యానర్లను బుధవారం ఏర్పాటు చేసి రైతులతో మాట్లాడారు. రైతుసేవా కేంద్రాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సాధారణ రకం క్వింటాల్ రూ.2300, 75 కేజీలు రూ.1725, 40 కేజీలు రూ.920, అలాగే గ్రేడ్ - ఏ క్వింటాల్ రూ.2375, 75 కేజీలు రూ.1740, 40 కేజీలు రూ.928 ధాన్యం రేటుగా నిర్ణయించారన్నారు.

వారోత్సవాలు ఒక్క రోజుతో సరి

● బాలల హక్కుల వారోత్సవాలకు అధికారుల తూట్లు



జడ్పీ పాఠశాలలో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీలు

ప్రత్తిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల పాటు రోజుకో కార్యక్రమంతో నిర్వహించాల్సిన బాలల హక్కుల వారోత్సవాలను ముగింపు కార్యక్రమంతో సరిపెట్టేశారు. ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనేక రకాల ప్రజోపయోగ కార్యక్రమాలను రూపకల్పన చేస్తుంది. అయితే క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ కార్యక్రమాలను మమ అనిపించేస్తున్నారు. బాలల హక్కులకు సంబంధించి ప్రభుత్వం వారం రోజుల పాటు నిత్యం కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జడ్పీ పాఠశాలల్లో బాల, బాలికలకు అవగాహనా కార్యక్రమాలతో పాటు బాలల హక్కులు, బాల్య వివాహాలు వంటి వాటిపై వివరించాల్సి ఉంది. అంతేకాకుండా దీనికి సంబంధించి పాఠశాలల్లో ఆటలు, యోగా కార్యక్రమాలు, పబ్లిక్ ప్రదేశాలలో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు వంటివి ప్రతి గ్రామంలో నిర్వహించాలి. కాని ఇలాంటివి ఏమీ లేకుండా చివరి రోజున ప్రత్తిపాడు జడ్పీ పాఠశాలలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించి, కొద్ది దూరం ర్యాలీ నిర్వహించి కార్యక్రమాన్ని ముగించారు. ఒక్క రోజు మాత్రమే కార్యక్రమం నిర్వహించడంపై అధికారులు నోరు మెదపటం లేదు.

పెదకొండూరు రీచ్‌లో జేసీబీతో ఇసుక తవ్వకాలు

దుగ్గిరాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పెదకొండూరు రీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా జేసీబీతో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఉచిత ఇసుకను గృహావసరాలకు వినియోగించుకోవచ్చని, ట్రాక్టర్‌లలో కూలీల ద్వారా ఇసుకను తవ్వించి తీసుకెళ్లవచ్చునని వెసులుబాటు కల్పిస్తూ, ప్రభుత్వం నిర్ణయం మేరకు అనుమతులు జారీచేసిన విషయం విదితమే. కాగా అనుమతులిచ్చిన మేరకు కూలీలతో ఇసుక తవ్వకాలు జరిపాలని నిబంధనలు చెబుతున్నప్పటికీ రీచ్‌లో బుధవారం తెల్లవారుజాము నుంచే, ఇబ్బడిముబ్బడిగా ట్రాక్టర్లలోకి జేసీబీతో ఇసుకను తోడి వందలాది ట్రాక్టర్‌లలో నింపుతున్నారన్న సమాచారం అధికారులకు చేరింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బి సునీత, ఎస్ఐ వెంకటరవికి ఫోన్ చేసి జేసీబీని గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా రీచ్‌లో తవ్వకాలకు వినియోగించిన జేసీబీని గుర్తించి స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ తెలిపారు. మైనింగ్ అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుందని సునీత పేర్కొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలి

ప్రత్తిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కాలనీలో నిర్మించాలనుకుంటున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం విషయంలో స్థానికుల అభిప్రాయాలు తీసుకుని ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రత్తిపాడు పంచాయతీ సభ్యుడు కాకాని సురేష్‌బాబు తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చిండంతో పాటు రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య నుంచి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిర్మాణాన్ని వడ్డెర కాలనీలో ఏర్పాటు చేయాలని వైసీపీకి చెందిన వార్డు సభ్యులు, అందరి అభిప్రాయాలు తీసుకున్న తరువాత నిర్ణయం తీసుకోవాలని తెలుగుదేశం పార్టీకి చెందిన వార్డు మెంబర్లు కోరారు. దీనిపై ఇప్పటికే ఆ కాలనీకి చెందిన వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే పంచాయతీలో అనుకూలంగా పది మంది సభ్యులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఖాజా తదితరులు పాల్గొన్నారు.

416 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 416 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, కాయ ఒకే ధరలు పలికాయి. క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,100 గరిష్ఠ ధర రూ.11,350, మోడల్ ధర రూ. 11,000 పలికాయి.

మంచి పుస్తకం మంచి మిత్రుడి కంటే గొప్పది

● గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో పంచాయతీ కార్యదర్శి హరిబాబు



తాడికొండలో బహుమతులు అందుకున్న విద్యార్థినులతో అతిథులు

తాడికొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మంచి పుస్తకం మంచి మిత్రుడి కంటే చాలా గొప్పదని తాడికొండ పంచాయతీ కార్యదర్శి హరిబాబు అన్నారు. శాఖ గ్రంథాలయం, మహిళా బాలల గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు చూడకుండా పుస్తక పఠనాన్ని చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరి, మాజీ మునుసుబు త్రిపురనేని మల్లేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

● తుళ్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ అధికారి టీ.గిరిధర్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. తుళ్లూరు పీహెచ్‌సీ వైద్యులు దాసరి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానం సమపార్జించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వీరస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

● మంగళగిరి సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ ఆరోగ్యం, మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జే వరప్రసాదరావు, ఎస్ఎల్ఎం చైతన్య హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ బాలకృష్ణ, ఇంగ్లిష్ టీచర్ డీఎస్‌కే శర్మ, పీ.కృష్ణ, ఎస్‌కే అబ్దుల్ కషూర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని నూతక్కి శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రామ పెద్దలు, దాతల సహకారంతో బహుమతులను ప్రదానం చేశారు.

● తాడేపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థితికి రావాలంటే విద్య, విజ్ఞానం, పట్టుదల, కృషి ముఖ్యమన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, రమేష్, సాయి వైష్ణవి, షకీల, పర్వీన్, గ్రంథాలయ అధికారి పాల్గొన్నారు.

● దుగ్గిరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమం అనంతరం బహుమతులు అందించారు. ఎంఈవో కాజ లక్ష్మీనారాయణ, గ్రంథాలయాధికారి జ్యోతి, ప్రొఫెసర్ లలితానంద, హెచ్ఎం శోభాదేవి పాల్గొన్నారు.

● పెదనందిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో వారం రోజులుగా జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పాఠ్య పుస్తకాలతో పాటు వార, మాస, దిన పత్రికలను పఠనం చేయడం వల్ల పోటీ పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, గ్రంథాలయ అధికారి పి.సుభాషిణి, రోటరీ క్లబ్ సభ్యులు పోపూరి లక్ష్మీనారాయణ, నల్లపనేని శివప్రసాద్, పారిశ్రామికవేత్త అరవపల్లి కృష్ణ, విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

● ప్రత్తిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలుగు యువత మండల అధ్యక్షుడు చిన్నం శ్రీకాంత్ అన్నారు. 57వ జాతీయ స్థాయి గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయంలో జరిగింది. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను నాయకుల చేతుల మీదగా అందజేశారు. లైబ్రరియన్ అరుణ ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కాకాని సురేష్, డబ్బూరి వెంకటేశ్వర్లు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, రిటైర్డ్ లైబ్రరియన్ సుభాని, గురవయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● వట్టిచెరుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వట్టిచెరుకూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాదెండ్ల అప్పారావు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాసర కాన్సెప్ట్ స్కూల్ హెచ్ఎం అల్లాభక్షు, గ్రంథాలయ శాఖ అధికారి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

● మేడికొండూరు నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మేడికొండూరులోని శాఖా గ్రంథాలయంలో ముగింపు సందర్భంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలు పొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మేడికొండూరు సర్పంచ్ పి.నాగమణి మాట్లాడుతూ మంచి పుస్తకాలు లభ్యమయ్యే గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఆమె కోరారు. అనంతరం సర్పంచ్ నాగమణి, పంచాయతీ కార్యదర్శి జి.సురేష్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సుధారాణి, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తోటమ్మ తల్లి హుండీల ఆదాయం రూ.1.08 లక్షలు

పొన్నూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోటమ్మ తల్లి ఆలయంలో హుండీల లెక్కింపు ద్వారా రూ.1.08 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ మేనేజర్ ఆర్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. బుధవారం ఇన్‌స్పెక్టర్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



రౌడీషీటర్‌పై పోక్సో కేసు

తెనాలి, మారీసుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికను ప్రేమ పేరుతో బలవంతంగా తీసుకువెళ్లేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్‌పై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక బాలాజీరావుపేటకు చెందిన 17 సంవత్సరాల బాలిక 10వ తరగతి వరకు చదివి ఇంటివద్దనే ఉంటోంది. ఐతానగర్‌కు చెందిన రౌడీషీటర్ మాతంగి భరత్ గత కొంతకాలంగా బాలికను ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడు. ఈ నెల 18న బాలిక ఇంట్లో లేని సమయంలో ఆమె వద్దకు వెళ్లి తనతో రావాలంటూ భరత్ బలవంతగా ద్విచక్రవాహనంపై ఎక్కించుకోబోయాడు. అదే సమయంలో బాలిక తండ్రి రావడంతో గమనించిన బాలికను వదలి పారిపోయాడు. దీనిపై బాలిక తండ్రి తన కుమార్తె రక్షణ కల్పించాలంటూ ఇచ్చిన పిర్యాదు మేరకు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రకాశరావు తెలిపారు.

దాడిపై కేసు నమోదు

తెనాలి క్రైమ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడిచేసిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఒన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులో నివాసం ఉండే ఆరాద్యుల వెంకటనాగకృష్ణప్రసాద్‌పై అదే ప్రాంతంలో ఉండే విడుదల సాయి, దానబోయిన వెంకటేశ్వరరావులు కలిసి దాడిచేసి గాయపర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

254మందికి కంటి వైద్య పరీక్షలు

పెదకాకాని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెదకాకానిలో టీడీపీ నాయకులు తుమ్మల శివరామకృష్ణ, బొల్లు అజయ్‌దీర్‌ల ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో పెదకాకానిలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ దీక్ష, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత శిబిరంలో 254మందిని కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 101మందికి కంటి శుక్లాల ఆపరేషన్ చేయడానికి సిఫార్సు చేశారు.

చేతిపంపు ఏర్పాటుపై వివాదం

తెనాలి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంచుపేటలో చేతి పంపు ఏర్పాటు విషయమై స్థానిక వ్యాపారికి మహిళలకు మధ్య వివాదం చోటుచేసుకుంది. స్థానిక 30వ వార్డులోని జెండా చెట్టు వద్ద పూజలు చేసుకునేందుకు కాళ్లుకడుక్కోవడానికి, తాగునీటి కోసం చేతి పంపు వేయాలని స్థానిక కౌన్సిలర్‌కు మహిళలు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆమె చేతి పంపు వేసేందుకు సిబ్బందిని బుధవారం ఆ ప్రాంతానికి పంపారు. పక్కనే ఉన్న ఓ వ్యాపారి ఇక్కడ పంపు వేయవద్దంటూ అడ్డు తగిలాడు. దీంతో మహిళలకు అతడికి మధ్య వివాదం చోటుచేసుకుంది. పంపు వేస్తే ఇక్కడే మద్యం తాగేవారు, గంజాయి సేవించేవారు, వ్యసనపరులకు అడ్డాగా మారుతుందని అందుకే పంపు వేసేందుకు తాను అభ్యంతరం పెట్టినట్లు వ్యాపారి చెప్పారు. కాగా మహిళలు మాత్రం తాము పూజలు చేసేందుకు నీరులేక ఇబ్బందులు పడుతున్నామని పవిత్రమైన దేవుడి సన్నిధిలో మద్యం తాగేందుకు ఎవ్వరూ సాహసించరని ఒకవేళ అలాంటివి జరిగితే తామే అడ్డుకుంటామంటూ బదులిచ్చారు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగడంతో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని ఇరువురిని సర్దిచెప్పి పంపారు.

క్రైస్తవ సమాధులకు స్థలాల సేకరణ హర్షణీయం

పొన్నూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ స్థలాల సేకరణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తర్వులు జారీ చేయటం హర్షణీయం అని ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి బుధవారం అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేసారు. క్రైస్తవుడైన జగన్‌రెడ్డి చేయలేని పని చంద్రబాబు చేశారన్నారు. అన్నివర్గాల ఆకాంక్షలను గుర్తించి క్రైస్తవులకు ఇచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చటానికి ముందడుకు వేయటం అభినందనీయం అన్నారు. రాబోయే క్రిస్మస్ దృష్ట్యా క్రిస్టియన్ కార్పొరేషన్‌ను కూడా చైర్మన్ నియమించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తల అభీష్టం నెరవేర్చాలి: ముక్తియార్ బేగం

పొన్నూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పొన్నూరు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానుల అభీష్టం నెరవేర్చేలా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు సముచిత స్థానం కల్పించాలని పురపాలక సంఘం మాజీ కౌన్సిలర్ షేక్ ముక్తియార్ బేగం కోరారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముక్తియార్ బేగం లేఖ రాశారు. నిత్యం ప్రజల గళం వినిపిస్తూ తెలుగుదేశం పార్టీకి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అంకిత భావంతో పనిచేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన నరేంద్రకుమార్‌కు సముచిత స్థానం కల్పించకపోవటంపై కార్యకర్తల్లో ఆవేదన ఉందన్నారు. ఈ విషయం అర్థం చేసుకొని నరేంద్ర కుమార్‌కు ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముక్తియార్ బేగం విజ్ఞప్తి చేశారు.

డంపింగ్ యార్డ్‌లో కొండలా చెత్త గుట్టలు

- కలుషితమౌతున్న పంట పొలాలు
- వాయు కాలుష్యంతో ప్రజలకు అవస్థలు
- అమలుకాని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని ఆదేశాలు
- మున్సిపల్ అధికారులు స్పందించకుంటే ప్రమాదమే..!


కొండను తలపిస్తున్న వ్యర్థాల గుట్టలు

తెనాలి, మారీసుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోజువారీ వ్యర్థాలను చేర్చే డంపింగ్‌యార్డ్ చెత్త గుట్టలతో కొండలను తలపిస్తోంది. యార్డు చుట్టుపక్కల ఉన్న పంట పొలాలు సైతం ఆ వ్యర్థాలతో కలుషితమై రైతులకు అపార నష్టాన్ని కలుగజేస్తున్నాయి. పట్టణంలోని 40వార్డులలో ప్రతిరోజు సుమారు 80 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయి. వాటిని మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ట్రాక్టర్‌లు, ఆటోలు, లారీలతో స్థానిక బుర్రిపాలెం రోడ్డులో ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డ్‌కు తరలిస్తారు. డంప్‌చేసిన వ్యర్థాలను తడిచెత్త పొడిచెత్తగా వేరుచేసి గుంటూరుకు సమీపంలోని జిందాల్ కంపెనీకి తరలిస్తారు. అయితే వీటి తరలింపులో జాప్యం జరుగుతోంది. వ్యర్థాలు రోజల తరబడి డంపింగ్ యార్డ్‌లోనే ఉంటూ దాదాపుగా 20 అడుగుల ఎత్తులో కొండలను తలపిస్తున్నాయి. ఆ వ్యర్థాలను తగలపెట్టే క్రమంలో వచ్చే పొగ, బూడిద పరిసర ప్రాంతాలలోని పంట పొలాలు, అపార్టుమెంటులోని గృహాలలో చేరి ప్రజలు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి ఏర్పడింది. గతంలో మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలసి అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో డంపింగ్ యార్డు విషయమై ప్రస్తావించారు. దీనివలన స్థానిక రైతులు అపార్టుమెంట్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తన దృష్టికి తీసుకువచ్చారని కొండలా ఉన్న వ్యర్థాలను మరో ప్రాంతానికి తరలించి సురక్షిత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అప్పట్లో మున్సిపల్ అధికారులు సైతం నెలలోపు మరో ప్రాంతానికి తరలిస్తామని కేంద్ర సహాయమంత్రికి తెలిపారు. కానీ క్షేత్రస్థాయిలో వారుచెప్పిన మాటలు మంత్రి ఆదేశాలు అమలుకు నోచుకోకపోడంతో ప్రజలు పురపాలక సంఘ తీరుపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రజలు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల పాలైతేకాని అధికారులలో కదలిక రాదా అంటూ ప్రశ్నిస్తున్నారు. తమ పంట భూములు బీడు భూములుగా మారి రైతులు నష్టపోతే తప్ప ప్రజా ప్రతినిధులు సైతం యార్డుపై దృష్టి పెట్టరా అంటూ రైతులు మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు డంపింగ్ యార్డులోని చెత్త గుట్టలపై దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని పలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


కొలకలూరులో బహుమతులు అందిస్తున్న గ్రామ కార్యదర్శి, పెద్దలు

తెనాలి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి ప్రారంభమైన 57వ జాతీయ శాఖాగ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వారంరోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. మండలంలోని కొలకలూరు శాఖాగ్రంథాలయంలో ఆ శాఖ అధికారి కడియాల సుజాత ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి జీవీఎస్ఎస్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందించారు. దూళ్లనరేంద్రకుమార్, నారాయణరావు, తన్నీరు సుబ్బారావు, ఆదినారాయణరావు, రాజ్యలక్ష్మి, నాగేశ్వరరావు, జ్యోతి, పద్మరాజులు పాల్గొని గ్రంథాలయ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సంగంజాగర్లమూడి శాఖ గ్రంథాలయంలో ఆ శాఖ అధికారి జె. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పి.జయనాగలక్ష్మి, జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.శివరామకృష్ణలు ముఖ్యఅతిథులుగా పాల్గొని వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. హెచ్ఎం పి.జయరావు, ఉపాధ్యాయురాలు కె.శాంతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. పెదరావూరు శాఖ గ్రంథాలయంలో ఆ శాఖ అధికారి ఎ.రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మాజీ జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మారౌతు సీతారామయ్య, కార్యదర్శి దానయ్య, కృష్ణ, చంద్రమౌళి, సుబ్బారావు, నాగలక్ష్మి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. నందివెలుగు శాఖాగ్రంథాలయంలో ఆ శాఖ అధికారిని బొల్లు మాధవి ఆధ్వర్యంలో రిటైర్డ్ హిందీటీచర్ పారేపల్లి భార్గవరావు, దుర్గాప్రసాద్, సుబ్బారావులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందించారు. పలువురు గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: స్థానిక చెంచుపేటలోని జేఎంజే కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యమానికి కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షేనీ అధ్యక్షత వహించగా విశ్రాంత ఉపాధ్యాయుడు పొన్నెపల్లి గోపాల కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వకృత్వ పోటీలు, వ్యాసరచనలు, పెయింటింగ్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు రాంబాబు, సాంబశివరావు, సీహెచ్ విశ్రాంతమ్మ, జన్నమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పావులూరి శ్రీనివాసరావు, మొవ్వా సుబ్బారావు, లైబ్రేరియన్ కె.రమాదేవి, ప్రసాద్ బొల్లిముంత కృష్ణ, తదితరులు ప్రసంగించారు. కొత్తపేటలోని మహిళా బాలల గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ కె.అంజని, రఘునాధరావు, తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: పట్టణంలోని పాత పొన్నూరు శాఖ గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాత పొన్నూరు మండల పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.నరేష్ కుమార్, ఉపాధ్యాయుడు నీలోఫర్, జె.నిలీమా పాల్గొన్నారు.

డెల్టాలో ముమ్మరంగా వరి కోతలు

- తగ్గిన ధాన్యం ధరలు
- 30 నుంచి 35లోపే దిగుబడులు


కొల్లిపరలో యంత్రాలతో, కూలీలతో చేస్తున్న వరి కోతలు

కొల్లిపర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో మాగాణిలో వరికోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నూటికి 80శాతం పంట కోత దశలో ఉంది. దీంతో రైతులు వరి కోతలు కోయడానికి సిద్ధపడుతున్నారు. వాతావరణం అనుకూలించడంతో కొంతమంది రైతులు వరిలో పాయలు తీయడం ప్రారంభించారు. మరికొంత మంది రైతులు యంత్రాల ద్వారా వరికోతలు కోయడం మొదలు పెట్టారు. ఈ సంవత్సరం మండలంలో 6వేల 150హెక్టార్లలో రైతులు బీపీటీ వరి వంగడాలను సాగుచేయగా అధికశాతం రైతులు వెద పద్ధతి ద్వారా వరిని సాగు చేశారు. వెద పద్ధతి ద్వారా సాగుచేసిన వరితో పాటు ముందస్తుగా నాటువేసిన వరికూడా కోతకు సిద్ధమైంది. యంత్రాల ద్వారా నూర్పిడి ప్రారంభించిన రైతులు ధాన్యం దిగుబడులు చూసి నిరుత్సాహ పడుతున్నారు. గత సంవత్సరం ఎకరానికి 35 బస్తాల నుంచి 45 బస్తాల వరకు ధాన్యం దిగుబడులు రాగా ఈ సంవత్సరం 30 నుంచి 35లోపు ధాన్యం దిగుబడులు రావటంతో రైతులు పూర్తిగా డీలా పడిపోయారు. దీనికి తోడు గత సంవత్సరం వరి కోతలు సమయానికి 75 కిలోలు బస్తా ధాన్యాన్ని 1700 నుంచి 1900 రూపాయల వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అలాంటిది ఈ ఏడాది 1400 రూపాయల మించి కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సంవత్సరం వరి సాగు చేయడానికి అధికంగా ఖర్చులు అయినట్లు రైతులు తెలుపుతున్నారు. వరిలో రైతులు ఆశించిన దిగుబడులు రాకపోవటంతో పాటు ప్రస్తుతం ధాన్యానికి ఉన్న ధరను బట్టి పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే రైతులు రెండవ పంటగా మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

తెనాలి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని చిన్న వయస్సులో వివాహం చేయడంవల్ల బాలికలు విద్య, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని కొలకలూరు సచివాలయ మహిళా సంరక్షణ, శిశు సంక్షేమ కార్యదర్శులు జి.ప్రగతి, ఎం.మల్లికలు చెప్పారు. బుధవారం గ్రామంలో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు బాలలహక్కులు, బాల్య వివాహాల వలన జరిగే నష్టాలపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ద్వారా వివరించారు. రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ వాకా లక్ష్మణ్, సీఆర్ఎఫ్ ఎన్‌జీవో రజని, స్కూల్ ఇన్‌చార్జ్‌హెచ్ఎం బాల నాగయ్య నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిమబిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

600కిలోల కంచుతో ఎన్టీఆర్ భారీ విగ్రహం


ఆరు వందల కిలోల కంచుతో తయారు చేసిన ఎన్టీఆర్ విగ్రహం

తెనాలి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెనాలి సూర్య శిల్పశాలలో 600కిలోల కంచుతో ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని తయారు చేశారు. ప్రకాశం జిల్లా నాగుల ఉప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఎన్టీఆర్ అభిమానులు చేయించారని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి రవిచంద్ర, శ్రీహర్షలు తెలిపారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. గ్రామంలో పార్టీ కార్యాలయంపై విగ్రహాన్ని నెలకొల్పనునట్లు ఆ గ్రామ టిడిపి నాయకులు నాగేశ్వరరావు, రంగారావు తెలిపారు. విగ్రహ తయారీకి పారిశ్రామిక వేత్త ఆంజనేయులు, రంగారావు, ప్రేమ్‌చంద్‌లు సాయం చేశారని చెప్పారు.

ప్రజల ఆర్థిక ప్రగతికి సహకార సొసైటీలు దోహదం: జడ సురేష్

తెనాలి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజ ఆర్థిక ప్రగతికి సహకార సొసైటీలు దోహదపడుతున్నాయని సహకార శాఖ అధికారి జడ సురేష్ చెప్పారు. కొత్తపేటలో కాకతీయ కో ఆపరేటివ్ సొసైటీలో బుధవారం సహకార వారోత్సవాలు ప్రారంభించారు. సమావేశంలో సురేష్ మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులకు దీటుగా సొసైటీలు సేవలందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డీఎల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మీ, వైస్ చైర్మన్ గ్రంధి చంద్రమౌళీశ్వరరావు, డైరెక్టర్లు ప్రసాద్, బ్రహ్మాచార్యులు, చక్రధర్, వాసుదేవనాయుడు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో ఫార్మసిస్టులది కీలకపాత్ర

- తహసీల్దార్ గోపాలకృష్ణ


తహసీల్దార్ గోపాలకృష్ణను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

తెనాలి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో ఫార్మసిస్టులు కీలకపాత్ర పోషిస్తారని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని తహసీల్దార్ ప్రారంభించారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు విడనాడాలని, రక్తదానం చేసిన వెంటనే కొత్తరక్తం తయారవుతుందన్నారు. ఆరోగ్యవంతమైన మనిషి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునని తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి భానుమతి మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు, ఆరోగ్య సదస్సులు నిర్వహించి ఫార్మసీ విద్యార్థులు సేవలు అందిస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో రామచంద్రరావు, నాగార్జునరెడ్డి, లక్ష్మీదుర్గ, నందగోపాలకృష్ణ, భార్గవి, జ్యోతిబసు, కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు. ఫార్మసీ విద్యార్థులు 30యూనిట్ల రక్తాన్ని అందించారు.

కుంచవరంలో వారాహి అమ్మవారి ఆలయ భూమిపూజ

కొల్లిపర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచవరంలో వారాహి అమ్మవారి ఆలయ భూమిపూజ మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఆగమ పండితులు మామిళ్ళపల్లి మృత్యుంజయప్రసాద్ శివాచార్య శిష్యబృందం పూజా కార్యక్రమాలు జరిపారు. పోస్టు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం చేపట్టారు. విశిష్ట అతిథి ప్రజ్ఞానంద సరస్వతీ మాట్లాడుతూ అమ్మవారి విశిష్టతను వివరించారు. నరేంద్ర రామానుజ దాసస్వామి, డీఎల్ కాంతారావు, నన్నపనేని లింగారావు, ముద్దాబత్తుని రమణయ్య, రామకృష్ణ, సీతారామయ్య, టి.శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరిదేవి, టి.రమణరావు, శిల్పి శ్రీనివాస్, చల్లా పుల్లారావు, గౌరీశంకర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం


శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, ట్రస్టు సభ్యులు

తెనాలి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం శ్రీనివాస కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్టు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జరిపిన కళ్యాణోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తొలుత కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. ట్రస్టు సభ్యులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్ ఉప్పల వరదరాజులు తదితరులు పర్యవేక్షించారు.

సైడ్ ఎఫెక్ట్స్ లేని చికిత్స విధానమే ఫిజియోథెరపి

- డాక్టర్ శ్రీష్టి అపర్ణ





తెనాలి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శరీర అవయవాల కదలికలు, పనితీరును మెరుగుపచ్చటంలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేని చికిత్స విధానమే ఫిజియోథెరపి అని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ శ్రీష్టి అపర్ణ ఆంధ్రజ్యోతికి తెలిపారు. అనారోగ్య సమస్యలను ఫిజియోథెరపీతో పరిష్కరించే విధానంపై తెలిపిన వివరాలు..

ప్రశ్న: ఫిజియోథెరపీ ఎటువంటి వారికి చేస్తారు?
జవాబు: కండరాలు, కీళ్ల నొప్పులను తగ్గించడానికి, నరాలు, కండరాల పనితీరును మెరుగుపరచడానికి ఫిజియోథెరపీ చేస్తాం.
ప్రశ్న: ఏఏ సమయాల్లో కండరాల నొప్పులు తీవ్రతరమవుతాయి?
జ: వాతావరణంలో బాగా చల్లగా ఉండే సమయంలో కండరాల సమస్యలు, కాళ్లు చేతులు పట్టేయడం, చేతివేళ్ల కొంకర్లుపోవడం, కీళ్ల నొప్పులు పెరుగుతుంటాయి. ఇలాంటి సమయంలో ఫిజియోథెరపీ ఉపయోగపడుతుంది.
ప్రశ్న: ఫిజియోథెరపీతో పాటు రోగులకు ఎటువంటి సూచలను చేస్తారు?
జ: ఫిజియోథెరపీకోసం వచ్చే వారికి వ్యాయామం ద్వారా పరిష్కారమయ్యే విధానాన్ని అవగాహన కల్పిస్తాం. వీటి ద్వారా ఇంట్లోనే ఉండి ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా సాధ్యమైనంత వరకు సమస్యలను అధిగమించి చక్కటి జీవితాన్ని గడపవచ్చు.
ప్రశ్న: నొప్పి నివారణకు ఎటువంటి పద్ధతులు వాడుతారు?
జ: ఫిజియోథెరపిలో నొప్పిని తగ్గించడానికి ఐఎఫ్‌టీ, టెన్స్ అల్ట్రాసౌండ్ థెరపి, హీటింగ్ మెడాలిటీస్, క్రయోథెరపి, డ్రైనీడ్లింగ్ టేపింగ్ వ్యాక్సు థెరపీ, కప్పింగ్ థెరపి, మయోఫేషియల్ రీలీజ్ వంటి ఆధునిక పద్ధతులతో నొప్పి తగ్గించొచ్చు.
ప్రశ్న: ఫిజియోథెరపీ ఎటువంటి వారికి ఎక్కువగా అవసరమౌతుంది?
జ: మోకాలు మార్పిడి, తొంటి మార్పిడి, ప్రమాదాల్లో గాయాలైన సందర్భాల్లో ఆపరేషన్ల తర్వాత ఫిజియోథెరపీ ఎంతో అవసరం. 50శాతం థెరపీ వల్లే తగ్గుతాయి. పక్షవాతం, నరాల బలహీనత, వెన్నుపూస విరగడం వంటి దీర్ఘకాలిక న్యూరో కేసుల్లో రోజూ ఫిజియోథెరపీ చేయించుకోవాల్సి ఉంటుంది.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న, పక్కన ఏసీపీ శ్రీమన్నారాయణ, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు

మున్సిపల్ చట్టం ప్రకారమే ఆక్రమణల తొలగింపు

- కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తోపుడు బండ్ల తొలగింపులో ఎటువంటి కక్ష సాధింపు చర్యలు లేవని మున్సిపల్ చట్టం ప్రకారం ఆక్రమణలను తొలగించామని పట్టణ పురపాలక సంఘ కమిషనర్ శేషన్న అన్నారు. బుధవారం పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ శేషన్న మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లపై ఆక్రమణల తొలగింపు మున్సిపల్ చట్టంలోకి వస్తుందని చెప్పారు. చిరువ్యాపారుల కోసం మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్ కాంప్లెక్సను నిర్మించామన్నారు. దానిలో షాపులను గుడ్‌విల్, నెలవారీ అద్దెలకు షాపులను కేటాయించామన్నారు. కొంతమంది చిరువ్యాపారులు కాంప్లెక్స్ ఫుట్‌పాత్‌లను, రోడ్లను ఆక్రమించుకొని తోపుడు బండ్లు, బుట్టలతో వ్యాపారాలను నిర్వహించడంతో కాంప్లెక్స్‌లోని షాపుల వద్దకు వినియోగదారులు రాక వ్యాపారాలు లేక నష్టపోతున్నారని అన్నారు. రోడ్డు ఫుట్‌పాత్‌లను కూడా ఆక్రమించడం రోడ్లకు అడ్డంగా తోపుడు బండ్లతో వ్యాపారాలను నిర్వహించడం వలన ట్రాఫిక్ కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని దీనితో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని పురపాలక సంఘం చట్టం ప్రకారం ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పట్టణంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం కొనసాగుతుందని కమిషనర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పీఎం స్వానిధి పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పీఎం స్వానిధి పథకంపై అవగాహన

పొన్నూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని చిరువ్యాపారులు ప్రధానమంత్రి స్వానిధి పథకంను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ హనుమానాయక్ కోరారు. పొన్నూరు పట్టణంలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని చిరువ్యాపారులకు పీఎం స్వానిధి పథకంపై అవగాహన కల్పించారు. పట్టణంలోని రోడ్లవెంట తోపుడు బండ్లపై చిరువ్యాపారులు సాగించే వర్తకులు, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు నగదు తీసుకొని ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. మెప్మా అధికారులను సంప్రదిస్తే పీఎం స్వానిధి కింద తొలివిడతగా రూ.10 వేలు మంజూరు చేయనునట్లు చెప్పారు. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లిస్తే రెండో విడత 20వేలు, ఆ తర్వాత రూ.50వేల వరకు రుణాలు మంజూరుచేసే అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 1775మంది చిరువ్యాపారులకు రూ.2.20కోట్ల రుణాలు అందించామన్నారు. రాష్ట్రంలోని చిరువ్యాపారులకు రుణాలు మంజూరులో పొన్నూరు పురపాలక సంఘం ప్రథమ స్థానంలో నిలవగా రాష్ట్ర ప్రభుత్వం అవార్డు అందచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా, పలు బ్యాంక్‌లకు చెందిన అధికారులు చిరువ్యాపారులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులను సక్రమంగా నిర్వహించండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శానిటేషన్ పనులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని 14వ వార్డులో బుధవారం జరుగుతున్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లను మురుగు కాలువలో వ్యర్థాలను తొలగించి మురుగునీటి పారుదలకు ఆటకం లేకుండా చూడాలన్నారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై అధికారులతో చర్చించి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, అసిస్టెంట్ ఇంజనీర్ సూరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.